# తెలంగాణ ముచ్చట్లు

TELANGANA MUCHATLU

TELTEL/2023/88710

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

తెలుగు దిన పత్రిక

వరంగల్ | మంగళవారం-18- నవంబర్ 2025 | సంపుటి : 3 | సంచిక : 171 | పేజీలు - 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in


## ఉమ్రా యాత్రికులతో వెళ్తున్న బస్సు దగ్ధం

# 45 మంది దుర్మరణం



- మక్కా–మదీనా మార్గంలో ఘోర విషాదం
- ఉమ్రా యాత్రికులతో వెళ్తున్న బస్సు దగ్ధం
- హైదరాబాద్ వాసులే 43 మంది మృతి
- ఒకే కుటుంబానికి చెందిన 18 మంది దుర్మరణం
- 46 మందిలో ఒక్కరే ప్రాణాలతో బయటపడిన వాడు
- జెడ్డాలోని మూడు ఆస్పత్రులకు మృతదేహాల తరలింపు
- మదీనాలో ఖననం చేసే అవకాశాల పరిశీలన
- సౌదీ అధికారుల దర్యాప్తు కొనసాగింపు
- రాయబార కార్యాలయాల పర్యవేక్షణ–హెల్ప్‌లైన్‌లు ప్రకటింపు
- తెలంగాణ భవన్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

సౌదీ అరేబియాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. మక్కా, మదీనా సందర్శించుకోవాలనే తమ చిరకాల వాంఛను తీర్చుకునేందుకు హైదరాబాద్ నుంచి వెళ్లిన 45 మంది ఉమ్రా యాత్రికులు దుర్మరణం పాలయ్యారు. వీరిలో 43 మంది నగరానికే చెందిన వారు కాగా, మరో ఇద్దరు కర్ణాటకకు చెందిన వారు. వీరు ప్రయాణిస్తున్న బస్సును ఆయిల్ ట్యాంకర్ ఢీకొట్టగా మంటలు చెలరేగడంతో అంతా సజీవ దహనమయ్యారు. మక్కా నుంచి మదీనా వెళ్తుండగా సోమవారం తెల్లవారుజామున మదీనాకు సమీపంలో ఈ దుర్ఘటన జరిగింది. ఉదయాన్నే అందిన పిడుగుపాటు లాంటి వార్త నగరవాసుల్ని కలచివేసింది.



ఈ ప్రమాదంలో తల్లిదండ్రులు, వారి కుమారులు, కుమార్తెలు, వారి పిల్లలు సహా ఒకే కుటుంబానికి చెందిన 18 మంది మృతి చెందడం తీవ్ర విషాదాన్ని నింపింది. మొత్తం 46 మంది బస్సులో ప్రయాణిస్తుండగా ఒక్కరు మాత్రం ఈ ప్రమాదం నుంచి బయటపడినట్లు సమాచారం. మరణించిన నగర వాసుల్లో 18 మంది పురుషులు, 26 మంది మహిళలు కాగా వీరిలో 10 మంది చిన్నారులు ఉన్నారు. వీరి మృతదేహాలను జెడ్డాలోని కింగ్ ఫహద్, కింగ్ సల్మాన్,

మిగతా 2లో

## సౌదీ బస్ ప్రమాదం..

## తెలంగాణ ప్రభుత్వం అప్రమత్తం

- వీసీ సజ్జనార్ స్పందనతో కలకలం
- హైదరాబాద్ యాత్రికుల వివరాల సేకరణ ప్రారంభం
- పిలిగ్రిమ్స్ కుటుంబాలకు సమాచారం చేరవేతపై దృష్టి

సౌదీ అరేబియాలో భారత యాత్రికులను తీసుకెళ్తున్న బస్సు ప్రమాదం విషాదకర మలుపు తీసుకుంది. ఈ బస్సులో మొత్తం 46 మంది ఉన్నారని ప్రాథమిక సమాచారం చెబుతుండగా, అందులో ఒక్క వ్యక్తి మాత్రమే ప్రాణాలతో బయటపడటం తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. ప్రమాద స్థితిగతులపై అధికారిక సమాచారం కోసం దేశ వ్యాప్తంగా ఉన్న కుటుంబాలు ఎదురుచూస్తున్నాయి. ప్రమాదంపై సమాచారం అందిన వెంటనే తెలంగాణ ప్రభుత్వం అప్రమత్తమైంది. బస్సులో ఉన్న వారిలో హైదరాబాద్‌కు చెందిన పలువురు ఉన్నట్టు భావించడం వల్ల రాష్ట్ర యంత్రాంగం మరింత వేగంతో వివరాలు సేకరిస్తోంది.

మిగతా 2లో



## కొమురవెల్లి మల్లన్న జాతరను వైభవంగా నిర్వహించాలి: మంత్రి కొండ సురేఖ

- మంత్రి కొండ సురేఖ అధికారి సమీక్ష
- వీడియో కాన్ఫరెన్స్‌లో అన్ని శాఖలకు సమన్వయ ఆదేశాలు
- భద్రత, రవాణా, నీరు, పారిశుద్ధ్యం
- జాతర ప్రారంభానికి ముందే అన్నీ పనులు పూర్తి చేయాలన్న స్పష్టమైన సూచనలు

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

రాబోయే కొమురవెల్లి శ్రీ మల్లికార్జున స్వామివారి కళ్యాణం మరియు జాతరను అత్యంత వైభవంగా, శ్రద్ధాభక్తులతో నిర్వహించేందుకు అన్ని విభాగాలు సిద్ధంగా ఉండాలని మంత్రి కొండ సురేఖ స్పష్టం చేశారు. సిద్ధిపేట జిల్లా ఎండోమెంట్ ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన ఆమె, జాతరకు లక్షలాదిగా వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగాలంటూ సూచనలు జారీ చేశారు.

మిగతా 2లో



## కేబినెట్ కీలక నిర్ణయాలు

### బీసీలకు 42% రిజర్వేషన్‌తో గ్రామ పంచాయతీ ఎన్నికలకు గ్రీన్‌సిగ్నల్





- గ్రామ పంచాయతీ ఎన్నికలకు ముందుగా గ్రీన్‌సిగ్నల్
- గిగ్ వర్కర్ల బిల్లుకు ఆమోదం
- అందెశ్రీకి స్మృతివనం.. కుమారుడికి డిగ్రీ లెక్చరర్ ఉద్యోగం

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన సోమవారం (సెప్టెంబర్ 17) సచివాలయంలో కేబినెట్ భేటీ జరిగింది. దాదాపు ఆరు గంటల పాటు జరిగిన ఈ సమావేశంలో లోకల్ బాడీ ఎలక్షన్స్, గిగ్ వర్కర్ల బిల్లుతో పాటు పలు అంశాలపై మంత్రి మండలి సుదీర్ఘంగా చర్చించింది. అనంతరం పలు కీలక నిర్ణయాలకు కేబినెట్ ఆమోదం తెలిపింది. కేబినెట్ భేటీ అనంతరం మంత్రిమండలి నిర్ణయాలను మంత్రులు మీడియాకు వివరించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని గతంలో ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని..

మిగతా 2లో

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం వేగవంతం



- గిరిజన ప్రాంతాలకు అదనపు కేటాయింపులు: మంత్రి పొంగులేటి
- గత ప్రభుత్వ నిర్మాణాలు లోపాలతో ఉన్నాయన్న విమర్శ
- ప్రతి గ్రామంలో పెద్దఎత్తున ఇందిరమ్మ ఇండ్ల పనులు పురోగతి

2లో

## రూ.74 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన


- ప్రతి రోడ్డును డబుల్ రోడ్డుగా మార్చనున్న ప్రభుత్వం
- కాంగ్రెస్ పాలన మరో 15 ఏళ్లు కొనసాగుతుందని నేతల నమ్మకం
- మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

నల్లగొండ జిల్లా మిర్యాలగూడ నియోజకవర్గంలో రూ.74 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన ఘనంగా జరిగింది. రాష్ట్ర మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఎంపీ రఘువీర్ రెడ్డి, ఎమ్మెల్యే బత్తుల లక్ష్మా రెడ్డి, ఎంఎల్సీ శంకర్ నాయక్ కలిసి పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. భారీ ర్యాలీలతో స్వాగతించిన కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలకు మంత్రులు ధన్యవాదాలు తెలిపారు.

మిగతా 2లో





## ఐబొమ్మ–బప్పం పై గట్టి వేట

- భారీ పైరసీ నెట్‌వర్క్‌ను ఛేదించిన హైదరాబాద్ సైబర్ క్రైమ్
- 65కి పైగా మిర్రర్ వెబ్‌సైట్లు నిర్వహించిన ప్రధాన నిందితుడు అరెస్ట్
- పిరసీ సైట్ల నుంచి బెట్టింగ్ ప్లాట్‌ఫారమ్‌లకు వినియోగదారుల మళ్లింపు
- ‘కాంతారా చాప్టర్ 1’, ‘డ్యూడ్’, వంటి కొత్త సినిమాల పైరసీపై దర్యాప్తు

2లో

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

## ఉమ్రా యాత్రికులతో వెళ్తున్న బస్సు దగ్ధం

# 45 మంది దుర్మరణం

(మొదటి పేజీ తరువాయి)

అల్ మిఖత్ ఆస్పత్రులకు తరలించినట్లు స్థానిక అధికారులు తెలిపారు.

జెద్దాలోని భారత రాయబార కార్యాలయ అధికారులు అక్కడి పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు.

మృతదేహాలను మదీనాలోనే స్థానిక సంప్రదాయాల మేరకు ఖననం చేయడానికి ఉన్న అవకాశాలను పరిశీలిస్తున్నారు. ఈ ఘటనపై ప్రధాని మోదీ, ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహా పలువురు ప్రముఖులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబసభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఇటీవల ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు, హైదరాబాద్ సమీపంలోని చేవెళ్ల వద్ద జరిగిన రెండు ఘోర బస్సు ప్రమాదాలను మరిచిపోకముందే మరో దుర్ఘటన జరగడం, ఏకంగా 44 మంది హైదరాబాదీలు మరణించడం నగరాన్ని కుదిపేసింది.

ఉమ్రా యాత్ర కోసం నగరంలోని వివిధ ట్రావెల్ ఏజెన్సీల నుంచి మొత్తం 54 మంది ఈ నెల 9న బయలుదేరి వెళ్లారు. మక్కా సందర్శన అనంతరం నలుగురు అక్కడే ఆగిపోగా.. మరో నలుగురు కారులో మదీనాకు వెళ్లారు. మిగిలిన 46 మందీ బస్సులో మదీనా వెళ్తుండగా గమ్యస్థానానికి 25 కి.మీ దూరంలో, భారత కాలమానం ప్రకారం ఉదయం 1:30 గంటల సమయంలో ఈ ఘోరం జరిగింది. బస్సు రోడ్డు పక్కన ఆగి ఉండగా, ఆయిల్ ట్యాంకర్ ఢీకొట్టడంతో పేలుడు సంభవించినట్లు ప్రత్యక్ష సాక్షి ఒకరు చెప్పారు. అయితే ప్రమాదానికి కారణాలను సౌదీ అధికారులు దర్యాప్తు చేస్తున్నారు.



జెద్దాలో ఉన్న భారత కాన్సులేట్ జనరల్ కార్యాలయంలో 24 గంటల కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు కేంద్ర మైనారిటీ వ్యవహారాల శాఖ మంత్రి కిరెన్ రిజిజు తెలిపారు. 8002440003 (టోల్ ఫ్రీ), 00966122614093, 0 0 9 6 6 1 2 6 6 1 4 2 7 6 00966556122301 (వాట్సాప్) హెల్ప్‌లైన్ నంబర్లను ప్రకటించారు. ప్రమాదం గురించి తెలిసిన వెంటనే జెద్దా నుంచి అధికారుల బృందం ఘటనా స్థలికి, ఆస్పత్రులకు వెళ్లినట్లు అక్కడి కార్యాలయ వర్గాలు తెలిపాయి.

రియాద్‌లోని ఎంబసీ కార్యాలయం కూడా సౌదీ అధికారులతో కలిసి పని చేస్తోంది. సౌదీ ప్రమాదం నేపథ్యంలో న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో కూడా అధికారులు కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. (కాంటాక్ట్ నంబర్లు.. వందన, పీఎస్ టు రెసిడెంట్ కమిషనర్, లైజన్ హెడ్ -+91 98719 99044, సీహెచ్. చక్రవర్తి, పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ - +91 99583 22143, రక్షిత్ నాయక్, లైజన్ ఆఫీసర్ -+91 96437 23157). ఇలావుండగా షెడ్యూల్ ప్రకారం యాత్రికుల బృందం ఈనెల 23న జెద్దా నుంచి హైదరాబాద్‌కు బయలుదేరాల్సి ఉంది. ఈ మేరకు వీరికి విమాన టిక్కెట్లు సైతం బుక్ అయ్యాయి.

## సౌదీ బస్ ప్రమాదం.. తెలంగాణ ప్రభుత్వం అప్రమత్తం

(మొదటి పేజీ తరువాయి)

ముఖ్యంగా సౌదీ అధికారులు, భారత దౌత్యపరిషత్‌తో నిరంతరంగా సంప్రదింపులు కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ ఘటనపై తెలంగాణ రాష్ట్ర పోలీస్ ఉన్నతాధికారి వీ.సీ. సజ్జనార్, IPS స్పందించారు. జరిగిన ప్రమాదం అత్యంత దుర్ఘటనమని, మొదటి సమాచారం ప్రకారం 46 మందిలో ఒక్కరే బ్రతికి బయటపడ్డారని తెలిపారు. హైదరాబాద్ నుంచి ప్రయాణించిన యాత్రికుల వివరాలను సేకరించేందుకు అన్ని శాఖలను మోహరించి చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. ఇక మృతుల గుర్తింపును పూర్తి చేయడం, వారి స్వదేశానికి రవాణా, కుటుంబాలకు సమాచారాన్ని అందించడం వంటి అంశాల్లో రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంతో సమన్వయం చేస్తోంది. ప్రమాదంపై మరిన్ని వివరాలు త్వరలోనే అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.



## కేబినెట్ కీలక నిర్ణయాలు

(మొదటి పేజీ తరువాయి)

కానీ రాష్ట్రపతి దగ్గర బీసీ రిజర్వేషన్ బిల్లు ఆగిపోయిందని గుర్తు చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని చిత్తశుద్ధితో భావించామన్నారు. కాంగ్రెస్ పార్టీ పరంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ మొదట గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తామని తెలిపారు. మిగిలిన జడ్పీటీసీ, ఎంపీటీసీ, మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలు అన్ని కూడా రిజర్వేషన్లపై హైకోర్టు తీర్పు తర్వాత నిర్వహిస్తామని క్లారిటీ ఇచ్చారు. గిగ్ వర్కర్ల బిల్లుకు కేబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. అందెశ్రీ అంత్యక్రియలు జరిగిన చోట స్మృతివనం ఏర్పాటు చేయడంతో పాటు ఆయన కుమారుడికి డిగ్రీ లెక్చరర్ ఉద్యోగం ఇవ్వాలని నిర్ణయించామని పేర్కొన్నారు.



## కొమురవెల్లి మల్లన్న జాతరను వైభవంగా నిర్వహించాలి: మంత్రి కొండ సురేఖ

(మొదటి పేజీ తరువాయి)

భక్తుల రాకపోకలను దృష్టిలో ఉంచుకుని రోడ్డు మార్గాలను మెరుగుపర్చడం, ట్రాఫిక్ నిర్వహణకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేయడం అత్యవసరమని ఆమె పేర్కొన్నారు. జాతర కాలంలో భద్రతా చర్యల పర్యవేక్షణ కోసం పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది, రెవెన్యూ అధికారులు సన్నద్ధంగా ఉండాలని ఆదేశించారు. త్రాగునీరు, పారిశుద్ధ్యం, పార్కింగ్ వంటి సేవల్లో ఎలాంటి లోపాలు ఉండకూడదని, ప్రతి అంశానికి ప్రత్యేక నోడల్ అధికారులను నియమించాలని సూచించారు. ఆలయాభివృద్ధికి సంబంధించిన పనులను పరిశీలించిన మంత్రి, పెండింగ్‌లో ఉన్న రహదారుల అభివృద్ధి, విద్యుత్ లైటింగ్, డ్రైనేజ్ సదుపాయాలను తక్షణం పూర్తి చేయాలని ఆదేశించారు. జాతర ప్రారంభానికి ముందే అన్ని పనులు పూర్తవ్వాలని స్పష్టమైన గడువు విధించారు. భక్తులకు క్యూ లైన్లలో నీడ సదుపాయాలు, వైద్య సేవలు, అత్యవసర సహాయ కేంద్రాలు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. జాతర సమయంలో సాంస్కృతిక కార్యక్రమాలు, సేవా కార్యకలాపాలు నిర్వహించే వాలంటీర్లతో కూడిన ప్రత్యేక బృందాలను సమన్వయంతో పనిచేయేలా సూచించారు. భక్తుల ఆరోగ్య భద్రత కోసం వైద్య బృందాలు, అంబులెన్స్‌లు సిద్ధంగా ఉండాలని, జాతర ప్రాంతంలో బోర్డులు, గైడెన్స్ మ్యాప్‌లు ఏర్పాటు చేయాలని మంత్రి ఆదేశించారు. కొమురవెల్లి మల్లన్న జాతర రాష్ట్రంలో అత్యంత రద్దీ జాతరల్లో ఒకటైనందున, భక్తుల విశ్వాసానికి ఏమాత్రం భంగం వాటిల్లకుండా ప్రభుత్వ యంత్రాంగం పూర్తి స్థాయిలో పని చేయాలని కొండ సురేఖ పునరుద్ఘాటించారు.

## రూ.74 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా మాట్లాడిన నేతలు, నియోజకవర్గంలోని ప్రతి రోడ్డును డబుల్ రోడ్డుగా మార్చే దిశగా పనులు ప్రారంభించామని తెలిపారు. ఈ ప్రాంత అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, నల్లగొండను మౌలిక సదుపాయాల పరంగా మరింత బలపరిచే కార్యక్రమాలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వ కాలంలో కేఎన్‌ఎం డిగ్రీ కాలేజీని ప్రభుత్వ పరిధిలోకి తీసుకురావడం కాంగ్రెస్ పార్టీ చేసిన ముఖ్యపని అని గుర్తుచేశారు. ప్రాంతీయ విద్యా, మౌలిక వసతుల అభివృద్ధిలో కాంగ్రెస్ పాత్రను నేతలు ప్రస్తావించారు. తెలంగాణలో కాంగ్రెస్ పాలన ఇంకా 15 ఏళ్లు కొనసాగుతుందని, అభివృద్ధి కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి నమ్మకాన్ని వ్యక్తం చేశారు.




## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం వేగవంతం

ఇల్లందు, నవంబర్ 17 (తెలంగాణ ముచ్చట్లు):

రాష్ట్రంలో పేదల గృహ నిర్మాణ ప్రక్రియ వేగంగా సాగుతున్నదని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. దశాబ్ద కాలం పాలించిన గత ప్రభుత్వాలు ఆత్మగౌరవ భవనాలు కడతామని చెప్పినా, మొండి గోడలతో ఉన్న నిర్మాణాలు మాత్రమే కనిపిస్తున్నాయని ఆయన విమర్శించారు. నిజమైన ప్రణాళికతో పేదల కోసం ఇళ్లు కట్టేది ప్రస్తుత ప్రజా ప్రభుత్వమేనని అన్నారు. ప్రతి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పెద్దఎత్తున జరుగుతుందని, ఇప్పటికే అనేక లబ్ధిదారులు గృహప్రవేశాలు కూడా చేసుకుంటున్నారని మంత్రి వివరించారు. గ్రామీణ మరియు గిరిజన ప్రాంతాల్లో ఇంటి కల నెరవేరుతున్నదని తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో గృహాల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి పెట్టిన ప్రభుత్వం, ITDA పరిధిలోని నియోజకవర్గాలకు అదనంగా 1,500 ఇండ్లు కేటాయించి మొత్తం 5,000 ఇందిరమ్మ ఇండ్లను అందిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. గిరిజన కుటుంబాలు సురక్షిత గృహాలను పొందేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.



## ఓటు చోరీపై కాంగ్రెస్ మహా నిరసన

- గాంధీ భవన్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్ దీక్షిత సందేశం
- దేశవ్యాప్తంగా ఓటు చోరీ ఉధృతి – ఎన్నికల కమిషన్‌పై ప్రశ్నలు
- ప్రజాస్వామ్య రక్షణ కోసం కాంగ్రెస్ నిరసనల పిలుపు
- సౌదీ బస్ ప్రమాదంలో మృతులకు యూత్ కాంగ్రెస్ నివాళులు

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

దేశవ్యాప్తంగా జరుగుతున్నట్లు ఆరోపణలు వస్తున్న ఓటు చోరీ ఘటనలపై కాంగ్రెస్ పార్టీ ఆగ్రహం వ్యక్తం చేసింది. తెలంగాణ గాంధీ భవన్‌లో జరిగిన మహా నిరసన కార్యక్రమంలో పాల్గొన్నమంత్రి పొన్నం ప్రభాకర్, బీజేపీ ప్రభుత్వం వివిధ మార్గాల్లో ఓటర్ల పేరు తొలగించడం, ఓటు చోరీకు పూనుకోవడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని హెచ్చరించారు. రాహుల్ గాంధీ దేశవ్యాప్తంగా చేసిన ఉదాహరణలు దీనికి బలమైన సాక్ష్యాలని పేర్కొన్నారు.





ఎన్నికల కమిషన్ ఎందుకు ఈ అక్రమాలను బయటపెట్టడంలో విఫలమవుతోందని పొన్నం ప్రశ్నించారు. స్వాతంత్ర్య సమర యోధుల వారసత్వంతో నడిచే కాంగ్రెస్ పార్టీ ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని సంకల్పించిందన్నారు. యూత్ కాంగ్రెస్ సైనికుల్లా ప్రజాస్వామ్య రక్షణకు కట్టుబడి పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమానికి పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జాతీయ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఉదయ భాను చిబ్, రాష్ట్ర అధ్యక్షుడు శివచరణ్ రెడ్డి, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులతో పాటు అనేక మంది యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు. నిరసనలో ప్రజాస్వామ్య పరిరక్షణ, ఓటర్ హక్కులపై మరింత జాగృతి సృష్టించాల్సిన అవసరాన్ని నాయకులు ప్రస్తావించారు. నిరసన కార్యక్రమం సందర్భంగా సౌదీ అరేబియా బస్ ప్రమాదంలో మృతి చెందిన భారత యాత్రికులకు యూత్ కాంగ్రెస్ నివాళులు అర్పించింది. కార్యక్రమం అంతటా ఘనంగా నివాళులు సమర్పించి బాధిత కుటుంబాలకు ఐక్యత తెలిపింది.

## ఐబొమ్మ–బప్పం పై గట్టి వేట

(మొదటి పేజీ తరువాయి)

టాలీవుడ్ చిత్ర పరిశ్రమకు భారీ నష్టాన్ని కలిగిస్తున్న అంతర్జాతీయ స్థాయి పైరసీ మాఫియాపై హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసు బృందం పెద్ద వేట చేపట్టింది. ఐబొమ్మ-బప్పం పైరసీ నెట్‌వర్క్‌ను నిర్వహిస్తున్న ప్రధాన నిందితుడు ఎమండి రవిను పోలీసులు అరెస్టు చేసినట్లు ఐపీఎస్ అధికారి వీ.సీ. సజ్జనార్ వెల్లడించారు. నిందితుడు 65కు పైగా మిర్రర్ వెబ్‌సైట్లను నడుపుతూ, కొత్తగా విడుదలయ్యే తెలుగు సినిమాలను అక్రమంగా అప్‌లోడ్ చేసి, చిత్ర పరిశ్రమకు వేల కోట్లు నష్టం కలిగించినట్లు దర్యాప్తులో తేలింది. పైరసీ సైట్లకు వచ్చే ట్రాఫిక్‌ను వంటి లాగ్ ట్రాకింగ్ ఆధారంగా ఈ ఆపరేషన్‌ను పోలీసులు విజయవంతంగా పూర్తి చేశారు. సైబర్ క్రైమ్ విభాగం ఈ కేసును విస్తృతంగా దర్యాప్తు చేస్తూ, ఈ నెట్‌వర్క్‌కు సంబంధించి మరిన్ని అరెస్టులు జరిగే అవకాశం ఉందని అధికారులు తెలియజేశారు.



## విద్యార్థుల భద్రతపై కవిత ఆందోళన

కల్వకుంట్ల కవిత

ఖమ్మం జిల్లాలోని టేకులపల్లి మోడల్ స్కూల్ పరిస్థితిని కల్వకుంట్ల కవిత ఆందోళన వ్యక్తం చేశారు. పాఠశాల హాస్టల్ భవనం పూర్తిగా ప్రమాదకర స్థితికి చేరి, విద్యార్థులు అసురక్షిత వాతావరణంలో ఉన్నారని ఆమె తెలిపారు. భవనం పగుళ్లు, పాడైన గోడలు విద్యార్థుల భద్రతను పూర్తిగా ప్రశ్నార్థకంగా మార్చాయని పేర్కొన్నారు. కొద్దిరోజుల క్రితం హాస్టల్ భోజనంలో బొద్దింకలు, పురుగులు ఉండటంతో పలువురు విద్యార్థులు అస్వస్థతకు గురైన ఘటనను కవిత వివరిస్తూ, ప్రభుత్వ నిర్వహణలోని మోడల్ స్కూళ్లు, గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లలో ఎంత అధ్వాన్న పరిస్థితులు నెలకొన్నాయో సూటిగా వెల్లడించారు. దీనిపై తక్షణ చర్యలు లేకపోవడం ఆందోళనకరమని ఆమె అన్నారు. రాష్ట్రంలో తాను ఏ జిల్లా పర్యటనకు వెళ్లినా అక్కడి హాస్టళ్లలో, స్కూళ్లలో సమస్యలు పెద్ద సంఖ్యలో ఎదురవుతున్నాయని కవిత ఆరోపించారు. ఈ పరిస్థితులు విద్యార్థుల భవిష్యత్తును ప్రమాదంలో నెడుతున్నాయని, కొన్ని చోట్ల నీరు, మరుగుదొడ్ల వంటి మౌలిక వసతులే అందుబాటులో లేవని ఆమె పేర్కొన్నారు. సంక్షేమ హాస్టళ్లలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలని కవిత డిమాండ్ చేశారు. విద్యార్థుల భద్రత, ఆరోగ్యం ప్రాధాన్యతగా తీసుకొని, హాస్టళ్లను సురక్షితంగా మార్చే తగిన చర్యలు త్వరితంగా చేపట్టాలని ఆమె స్పష్టం చేశారు.



## ఉపఎన్నిక ఫలితాలపై ఈటల రాజేందర్ స్పందన

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

ఉపఎన్నిక ఫలితాల నేపథ్యంలో బీజేపీ కార్యకర్తలకు ధైర్యం చెప్పిన పార్టీ సీనియర్ నేత, ఎంపీ ఈటల రాజేందర్, ఒక్క ఓటమి వచ్చినంత మాత్రాన కుంగిపోవాల్సిన అవసరం లేదని అన్నారు. ఉపఎన్నికల్లో అధికార పార్టీ గెలవడం సహజమని, భవిష్యత్తులో బీజేపీ తిరుగులేని శక్తిగా నిలుస్తుందని కార్యకర్తలకు హామీ ఇచ్చారు. డివిజన్ పాలిటిక్స్ ఆధారంగా తెలంగాణలో అధికారం సాధ్యం కాదని, కులంమతం ఆధారిత రాజకీయాలు శాశ్వతంగా నిలవవని తన వ్యక్తిగత అభిప్రాయాన్ని వెల్లడించారు. దేశవ్యాప్తంగా బీజేపీని ప్రజలు ఎదగనిచ్చిందంటే అభివృద్ధిసంక్షేమం అందరికీ అందినందువల్లేనని చెప్పారు. తెలంగాణలో గతంలో జరిగిన ఉపఎన్నికల ఉదాహరణలను ప్రస్తావించిన ఈటల,

నారాయణఖేడ్, హుజూర్నగర్, పాలేరు, నాగార్జునసాగర్, కంటోన్మెంట్, జూబ్లీహిల్స్ వంటి చోట్ల అధికార పార్టీ గెలిచిన విషయాన్ని గుర్తుచేశారు. దుబ్బాక, హుజురాబాద్ ఉపఎన్నికల్లో బీజేపీ గెలవడం ధర్మం గెలుపుగా అభివర్ణించారు. "కేసీఆర్ అహంకారం అణచడానికి ప్రజలు దుబ్బాకలో బీజేపీకి నిలబడ్డారు" అని చెప్పారు. జూబ్లీహిల్స్ ఎన్నికలో అధికార పార్టీ అనేక ప్రలోభాలు పెట్టినా గెలిచిందని, అటువంటి సమయంలో కార్యకర్తలు నిరుత్సాహపడాల్సిన అవసరం లేదని చెప్పారు. "బీజేపీ గెలిస్తే ఇవీఎంలను మేనేజ్ చేశారని అంటారు... మరి మీరు గెలిస్తే అవే ఇవీఎంలా?" అంటూ విమర్శించారు. బీహార్ ఎన్నికల్లో ముస్లిం జనాభా అధికంగా ఉన్న చోట 25 ఏళ్ల మైథిలీ ఠాగూర్ విజయం, బీజేపీకి అందరి మద్దతు ఉందని నిదర్శనమని ఈటల వ్యాఖ్యానించారు. ప్రధాని మోదీ ఇచ్చిన 'సబ్ కా సాత్ - సబ్ కా విశ్వాస్ - సబ్ కా వికాస్ - సబ్ కా ప్రయాస్' అనే నినాదమే బీజేపీ సిద్ధాంతమని అన్నారు. ప్రజలకు ఇప్పటి వరకు చేసిన పనులు, ఇక ముందు చేయబోయే కార్యక్రమాలు చెప్తూ నమ్మకం కలిగించడమే నిజమైన రాజకీయమని ఈటల సలహా ఇచ్చారు. "బరిగీసి కొట్లాడే తత్వం లేకపోతే పార్టీ ఎదగదు" అని కార్యకర్తలకు హితవు పలికారు.

## రోడ్డు భద్రత కోసం 'అరైవ్ అలైవ్'

- హైదరాబాద్ సిటీ పోలీస్ సంయుక్త కార్యక్రమం

హైదరాబాద్ సిటీ పోలీస్ మరియు హైదరాబాద్ సిటీ సెక్యూరిటీ కౌన్సిల్ కలిసి నిర్వహిస్తున్న 'అరైవ్ అలైవ్' రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమంలో ప్రసిద్ధ వ్యాఖ్యాత సుమా కనకాల పాల్గొన్నారు. రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయినవారికి గౌరవం తెలపడం, కుటుంబాలకు మద్దతు ఇస్తూ, ప్రజల్లో రోడ్డు భద్రతపై అవగాహన పెంచడం ఈ ప్రచార లక్ష్యమని సుమా తెలిపారు. డ్రైవింగ్ సమయంలో అప్రమత్తత, ట్రాఫిక్ నిబంధనల పాటింపు అనేవి ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆమె పేర్కొన్నారు. "మీ జీవితం ఎంతో విలువైనది. మీ కోసం ఇంట్లో ఎదురు చూస్తున్న కుటుంబం ఉంది. కాబట్టి జాగ్రత్తగా నడపండి" అంటూ సుమా ట్రాఫిక్ నిబంధనలను తప్పకుండా పాటించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బాధిత కుటుంబాలకు సానుభూతి తెలుపుతూ, రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు ప్రజలు కలిసికట్టుగా పని చేయాల్సిన అవసరాన్ని అధికారులు, స్వచ్ఛంద సంస్థలు వివరించారు. వివిధ మార్గాల్లో ట్రాఫిక్ సేఫ్టీపై అవగాహన కార్యక్రమాలు, ప్రచార ర్యాలీలు కొనసాగనున్నాయి.





## సీసీ రోడ్డు పనుల పర్యవేక్షణ కార్పొరేటర్ బన్నాల

**చిల్కానగర్, నవంబర్ 17 (తెలంగాణ ముచ్చట్లు):** ఉప్పల్ నియోజకవర్గం చిలుకానగర్ డివిజన్ లో సుమారు 56 లక్షల రూపాయల వ్యయంతో నిర్మాణంలో ఉన్న సీసీ రోడ్డు పనులను కార్పొరేటర్ జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ మాజీ సభ్యురాలు బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్ శనివారం పర్యవేక్షించారు. జిహెచ్ఎంసి అధికారులు, బ్యాంక్ కాలనీ మరియు రాఘవేంద్ర నగర్ కాలనీ అసోసియేషన్ సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ గీతా ప్రవీణ్ మాట్లాడుతూ, సీసీ రోడ్డు నిర్మాణ సమయం లో జిహెచ్ఎంసి ఇంజనీరింగ్ విభాగం అధికారుల నిరంతర పర్యవేక్షణ తప్పనిసరి అని స్పష్టం చేశారు. కాంట్రాక్టర్ నాణ్యత ప్రమాణాలను కచ్చితంగా పాటించేలా చర్యలు తీసుకోవాలని, నిర్మాణ పనుల వల్ల ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నాణ్యతలో లోపాలు తలెత్తితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి ఈఈ హరిలాల్, డిఈ వెన్నెల గౌడ్, ఏఈ రాధిక, వర్క్ ఇన్స్పెక్టర్ కేదార్, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, సీనియర్ నాయకులు ఎద్దుల కొండల్ కోకొండ, కోకొండ జగన్, పల్లె వేణు గౌడ్, బాలకృష్ణ గౌడ్, శ్యామ్, బంటి గౌడ్, చిన్న, బ్యాంక్ కాలనీ అసోసియేషన్ అధ్యక్షులు గఫూర్, జనరల్ సెక్రటరీ సందీప్ భూషణ్, వెంకటేశ్వరరావు, బాలా గౌడ్, రాఘవేంద్ర నగర్ అసోసియేషన్ అధ్యక్షులు జగదీశ్వర్ రెడ్డి, సభ్యులు రవి వర్మ, కృష్ణారెడ్డి, భాస్కరరావు, సత్యనారాయణ, గౌసుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



## ప్రతి సోమవారం రైతు అన్నదానం

◆ మూడో విడతగా సేవ కార్యక్రమం

**మేడ్చల్ మల్కాజిగిరి, నవంబర్ 17 (తెలంగాణ ముచ్చట్లు):** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో తెలంగాణ రైతు పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ప్రతి సోమవారం నిర్వహించే రైతు అన్నదానం కార్యక్రమం మూడో విడతగా సోమవారం నిర్వహించారు. ప్రజావాణి కోసం జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన సందర్శకులు ఈ అన్నదానాన్ని వినియోగించి హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా సమితి అధ్యక్షురాలు ఇంద్రపాల భవాని మాట్లాడుతూ, ప్రజావాణి నిమిత్తం ప్రతి సోమవారం వందలాది మంది కలెక్టర్ కార్యాలయానికి వచ్చే నేపథ్యంలో వారిలో కనీసం కొంతమందికైనా తమ సంస్థ తరపున భోజనం అందించగలుగుతున్నందుకు సంతోషంగా ఉందని తెలిపారు. జిల్లా కలెక్టర్ కార్యాలయాల వద్ద ప్రభుత్వం ఐదు రూపాయల భోజన పథకాన్ని అమలు చేస్తే మరింత మంది లబ్ధిపొందుతారని అభిప్రాయపడ్డారు. త్వరలో ఈ మేరకు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తామని తెలిపారు.సంస్థ ప్రధాన కార్యదర్శి ఇంద్రపాల సత్యనారాయణ మాట్లాడుతూ, గత మూడు వారాలుగా తమ శక్తి మేరకు రోజుకు వందమంది వరకు అన్నదానం అందిస్తున్నామని చెప్పారు. మరింత మంది దాతలు ముందుకు వస్తే పెద్ద ఎత్తున సేవ చేయగలమని తెలిపారు. దాతలు ఫోన్‌పే, గూగుల్‌పే ద్వారా 90320 88236 నెంబర్‌కు సహకారం అందించవచ్చని తెలిపారు. మూడో విడత కార్యక్రమానికి జవహర్‌నగర్ మాజీ కోఆప్షన్ సభ్యులు మహమ్మద్ ఫారుక్, సామాజిక కార్యకర్త రచన రెడ్డి సహకారం అందించగా, వారికి సంస్థ తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంబాల మల్లేష్, ఎండి రహిమాన్ పాల్గొన్నారు.

## దుర్గమ్మ గుడి వార్షికోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి



**వేలేరు,17నవంబర్(తెలంగాణ ముచ్చట్లు):** వేలేరు మండలం సోడషపల్లి గ్రామంలో దుర్గమ్మ గుడి వార్షికోత్సవాన్ని గ్రామ ప్రజలు శనివారం ఘనంగా నిర్వహించారు. గ్రామ పెద్దల ఆహ్వానం మేరకు స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఆలయంలో టెంకాయ కొట్టి ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే, గ్రామ అభివృద్ధి కలగాలనే సంకల్పంతో అమ్మవారి దివ్యాశీస్సులు అందరికీ కలగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మండలం, గ్రామ స్థాయి పార్టీ ప్రతినిధులు, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, యువజన నాయకులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు సహా అనేక మంది పాల్గొన్నారు.





# ఎల్కతుర్తిలో ఉచిత మెగా వైద్య శిబిరం

**ఎల్కతుర్తి,17నవంబర్(తెలంగాణ ముచ్చట్లు):** హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండల కేంద్రంలో రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాల మేరకు సోమవారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామ పంచాయతీ ప్రాంగణంలో జరిగిన ఈ శిబిరాన్ని జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ప్రారంభించి, ఓపీ, హెల్ప్‌డెస్క్, ల్యాబ్, ప్రాథమిక పరీక్షల విభాగాలను స్వయంగా పరిశీలించారు. కాకతీయ మెడికల్ కాలేజ్, ఎంజీఎం ఆసుపత్రుల సంయుక్త నిర్వహణలో జరిగిన ఈ శిబిరంలో 38 మంది నిపుణ వైద్యులు, 60 మంది పీజీలు, పారామెడికల్ సిబ్బంది కలిసి వైద్య సేవలు అందించారు. శిబిరానికి వచ్చిన మొత్తం 762 మందికి వైద్య సేవలు అందించగా, జనరల్ మెడిసిన్‌లో 292, ఆర్థోలో 127, కంటి విభాగంలో 170, ఈఎన్‌టీ విభాగంలో 45, చర్మం విభాగంలో 30, పిల్లల విభాగంలో 20, సర్జరీలో 25, స్త్రీరోగాల్లో 27 మంది సేవలు పొందారు. మరింత చికిత్స అవసరమైన 115 మందిని ఎంజీఎం మరియు జీఎంహెచ్ ఆసుపత్రులకు రిఫర్ చేశారు.శిబిరంలో 93 మందికి రూ.1.67 లక్షల విలువైన ల్యాబ్ పరీక్షలు, 122 మందికి రూ.16 వేల విలువైన షుగర్ పరీక్షలు నిర్వహించారు. మొత్తం రూ.2 లక్షలకు పైగా విలువైన మందులను పంపిణీ చేశారు. డీఎంహెచ్వో విజ్ఞప్తి మేరకు వరంగల్ కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ రూ.15 వేల విలువైన మందులు అందించింది. గ్రామాల్లో అందుబాటులో ఉండని ప్రత్యేక వైద్య సేవలను ప్రజలకు చేరవేయడమే ఈ శిబిరం ఉద్దేశమని అధికారులు తెలిపారు. గ్రామాల వారీగా ముందస్తు గుర్తింపు చేసి ప్రజలను శిబిరానికి తీసుకువచ్చేందుకు ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, గ్రామ సిబ్బంది చర్యలు తీసుకున్నారు.

## స్కేటింగ్ టోర్నమెంట్‌లో సైనిక్ పూరి స్వీట్ స్కేటింగ్ అకాడమీ విజృంభణ

**హైదరాబాద్, నవంబర్ 17 (తెలంగాణ ముచ్చట్లు):** ఇండియన్ బిగ్ వెస్ట్ సపోటార్స్ స్కేటింగ్-2025 ఆల్ ఇండియా ఓపెన్ స్కేటింగ్ టోర్నమెంట్‌ను యూత్ రోలర్ స్కేటింగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నెక్లెస్ రోడ్ ట్యాంక్ బండ్‌పై ఘనంగా నిర్వహించారు. దేశవ్యాప్తంగా 800 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్న ఈ టోర్నమెంట్‌లో సైనిక్ పూరికి చెందిన స్వీట్ స్కేటింగ్ అకాడమీ విద్యార్థులు మెరిసి పలు విభాగాల్లోఅధిక సంఖ్యలో పతకాలు సాధించారు.టోర్నమెంట్‌లో ప్రో ఇన్‌లైన్, క్యాడ్ స్కేటింగ్, రెగ్యులర్ ఇన్‌లైన్ స్కేటింగ్ వంటి విభాగాల్లో పోటీలు నిర్వహించినట్లు కోచ్ కన్నా గౌడ్ తెలిపారు. తమ అకాడమీ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరచి రాష్ట్ర, జాతీయ స్థాయిలో నిలబడడం గర్వకారణమని





ఆయన పేర్కొన్నారు.సెంట్ మేరీ బ్రిటానియా కాన్వెంట్ హై స్కూల్‌కు చెందిన రెండో తరగతి విద్యార్థిని పోస్తూ బ్లేస్సి, అండర్-8 విభాగంలో మొదటి బహుమతి సాధించి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. చిన్న వయస్సులోనే చూపిన స్కేటింగ్ ప్రతిభ అందరినీ ఆకట్టుకుంది.టోర్నమెంట్ విజయవంతంగా ముగియడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు, నిర్వాహకులు ఆనందం వ్యక్తం చేశారు.

## కార్తీక మాసం సందర్భంగా శ్రీ నందీశ్వరాలయంలో ప్రత్యేక పూజలు

◆ కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి

**మల్లాపూర్, నవంబర్ 17 (తెలంగాణ ముచ్చట్లు):** కార్తీక మాసం సందర్భంగా మల్లాపూర్‌లోని ప్రసిద్ధ శ్రీ నందీశ్వరాలయంలో సోమవారం భక్తిమయ వాతావరణం నెలకొంది. ఉదయం నుంచి ఆలయ వేదిక వద్ద ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించగా, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి ఆలయాన్ని సందర్శించి స్వామివారిని దర్శించుకున్నారు.ఆలయంలో పూజలు నిర్వహించిన అనంతరం, ఆలయ ప్రాంగణంలో కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. భక్తులకు స్వయంగా అన్నప్రసాదం అందజేస్తూ కార్పొరేటర్





మాట్లాడుతూ—"కార్తీక మాసంలో ఆలయాలలో జరిగే సేవా కార్యక్రమాలు ప్రజల్లో మంచి శాంతి, సామరస్యం పెంపొందిస్తాయి. మల్లాపూర్ శ్రీ నందీశ్వరాలయం ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయం" అని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పి.జి. సుదర్శన్, రాజేష్, శ్రీహరి గౌడ్, మహేందర్ తదితరులు పాల్గొని ఏర్పాట్లను సమర్థంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై ఆలయ ప్రాంగణం సందడిగా మారింది.



## స్పీడ్ బ్రేకర్లు లేకపోవడంతో మితిమీరిన వేగం

◆ పీచరలో స్థానికుల ఆందోళన

**వేలేరు, 17 నవంబర్ (తెలంగాణ ముచ్చట్లు):** వేలేరు మండలం పీచర గ్రామంలో వాహనదారులు మితిమీరిన వేగంతో ప్రయాణించడం స్థానికులకు ఆందోళన కలిగిస్తోంది. ఇటీవల గ్రామంలో ఏర్పాటు చేసిన సీసీ రోడ్డుపై స్పీడ్ బ్రేకర్లు లేకపోవడంతో వాహనాలు అదుపు తప్పేలా వేగంగా దూసుకెళ్తున్నాయి. రహదారిపై చిన్నపిల్లలు, వృద్ధులు తరచుగా సంచరిస్తుండటంతో ఎప్పుడైనా ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని గ్రామస్తులు భావిస్తున్నారు.ఈ పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని సంబంధిత అధికారులు వెంటనే స్పందించి స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని, గ్రామంలో సురక్షిత ప్రయాణ వాతావరణం ఉండేలా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.



## కైలాసగిరి కాలనీ ఎన్నికలు గందరగోళంలో

◆ మహిళలకు ప్రాతినిధ్యం ఇవ్వకుండా ఎన్నికల నిర్వహణపై కలెక్టర్‌కు ఫిర్యాదు

**మేడ్చల్–మల్కాజిగిరి, నవంబర్ 17 (తెలంగాణ ముచ్చట్లు):** మేడ్చల్ జిల్లా ఉప్పల్ నియోజకవర్గం మీర్పేట్ హౌసింగ్ బోర్డు నాలుగో డివిజన్ లోని కైలాసగిరి వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికలు వివాదా ల్లోకి చేరాయి. గత 16 సంవత్సరాలు గా అసోసియేషన్‌లో మహిళలకు పదవులు ఇవ్వకుండా ఎన్నికలు నిర్వహిస్తున్నారని పలువురు కాలనీవాసులు ఆరోపించారు.రిజిస్ట్రేషన్ నెంబర్ 91/2009తో రిజిస్టర్ అయిన అసోసియేషన్‌లో మహిళలను కేవలం సభ్యులుగా మాత్రమే తీసుకుంటున్నామని,"పదవులు మాత్రం ఇవ్వం... కొత్త సాంప్రదాయాలు వద్దు" అంటూ కొందరు బాధ్యులు మహిళలను ఎన్నికలు నుండి దూరం చేస్తున్నారని మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు.ప్రభుత్వం మహిళల పేర్లపైనే పట్టా భూములను జారీ చేస్తుండగా, కాలనీ అభివృద్ధి పనుల్లో మాత్రం మహిళలకు అవకాశం ఇవ్వకపోవడం అన్యాయం అని వారు పేర్కొన్నారు.గతంలో చాలామంది మహిళలు నామినేషన్ వేసేందుకు ముందుకొచ్చినా, వారి నామినేషన్లు స్వీకరించిన రికార్డులు లేవని మహిళలు ఆరోపిస్తున్నారు."బస్తీల్లోనే మహిళలు పదవులు చేపట్టలేరని చెప్పి అణగదొక్కుతు న్నారు. అదే బస్తీల్లో ఇతర అసోసియేషన్లు మహిళలతో సేవలు అందిస్తున్నాయి. మరి కైలాసగిరిలో ఎందుకు కాదు?" అని మహిళలు ప్రశ్నించారు."ఇదేమి రాజ్యం? దోపిడి రాజ్యమా?" అంటూ వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలకు ప్రాతి నిధ్యం కల్పించకుండా ఎన్నికలు నిర్వహిస్తే, మరో కొత్త కాలనీ సంక్షేమ సంఘాన్ని ఏర్పాటు చేయాల్సి వస్తుందని మహిళలు స్పష్టంగా హెచ్చరించారు.మహిళలను ఎన్నికల ప్రక్రియ నుండి దూరం చేస్తున్నారన్న ఆరోపణలతో ఎన్నికలను నిలిపివేయాలని జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. కైలాసగిరి కాలనీ ఎన్నికలపై ఈ వివాదం ప్రస్తుతం పెద్ద చర్చనీయాంశంగా మారింది.

తెలంగాణ TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

## పదిహేనేళ్లుగా పెండింగ్‌లో ప్లాట్లు.. భూమి హద్దుల కోసం నాగారం లబ్ధిదారుల పోరాటం




**నాగారం, నవంబర్ 17 (తెలంగాణ ముచ్చట్లు):** మేడ్చల్ నియోజకవర్గం కీసర మండలం నాగారం గ్రామ పరిధిలోని సర్వే నంబర్లు 84/2, 85/2, 86/2, 87/2లో గల మొత్తం 330 ప్లాట్లకు సంబంధించిన భౌతిక పొజిషన్ ఇవ్వాలని లబ్ధిదారులు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ కి విజ్ఞప్తి చేశారు.2009 ఫిబ్రవరి 2వ తేదీన బి/2006/2006 నంబర్‌తో అప్పటి పార్లమెంట్ సభ్యులు సర్వే సత్యనారాయణ లబ్ధిదారులకు 60 గజాల ప్లాట్లకు పట్టా సర్టిఫికేట్‌లు అందజేశారు. కానీ అప్పటి నుంచి దాదాపు 15 సంవత్సరాలు గడిచినా కూడా భూమిపై పొజిషన్ చూపించకపోవడంతో ప్రజలు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు.ఈ సందర్భంగా లబ్ధిదారులు బొలారం ఎల్లమ్మ, పంగ మంజుల, వై. సంగీత, అయ్యాగల్ల భాగ్యమ్మ, కిష్టా వరలక్ష్మి, జి. హేమలత, బాస భాగ్యరేఖ, ఎ. బాగ్యలక్ష్మి తదితరులు మాట్లాడుతూ——“మాకు ప్రభుత్వం ఇచ్చిన పట్టాలు ఉన్నా భూమిపై యాక్సెస్ లేదు. ఎక్కడ మా ప్లాట్ ఉందో తెలియక నిర్మాణం కూడా చేపట్టలేము. పదేళ్లకు పైగా అధికారులు, గ్రామపంచాయతి, రెవెన్యూ శాఖ చుట్టూ తిరుగుతున్నాం. ఇప్పుడు కలెక్టర్ మా సమస్యను పరిష్కరించగలరు” అని ఆవేదన వ్యక్తం చేశారు.ప్లాట్లకు సంబంధించిన వివరణాత్మక పత్రాలను కలెక్టర్ కార్యాలయానికి అందజేసిన లబ్ధిదారులు, రెవెన్యూ శాఖ లోనే భూమి హద్దులను చూపించి, పట్టా ప్రకారం పొజిషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.గ్రామ ప్రజలు కూడా దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా పరిపాలనను కోరుతున్నారు.

## క్యాన్సర్ రోగికి ఎమ్మెల్యే మెఘా రెడ్డి ఆర్థిక సాయం



**అడ్డాకుల,నవంబర్17(తెలంగాణ ముచ్చట్లు):** మహబూబునగర్ జిల్లా అడ్డాకుల మండలం బలీదుపల్లి గ్రామానికి చెందిన 29 ఏళ్ల ముష్టి సాయిబాబాకు క్యాన్సర్ వ్యాధి నిర్ధారించబడింది. ఈ విషయాన్ని కాంగ్రెస్ నాయకుడు కరుణాకర్ రెడ్డి ద్వారా తెలుసుకున్న వనపర్తి ఎమ్మెల్యే మెఘా రెడ్డి బాధితుడితో స్వయంగా ఫోన్ ద్వారా మాట్లాడారు. సాయిబాబా త్వరితగతిన మెరుగైన వైద్యం పొందేందుకు హైదరాబాదులోని ఎమ్ఐజీ ఆసుపత్రిలో ప్రత్యేక వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఆసుపత్రికి వెళ్లేందుకు అవసరమైన సహాయకంగా తన వంతుగా ₹10,000 ఆర్థిక సాయం అందించారు. భార్యతో పాటు ఇద్దరు చిన్నారులు ఉన్న సాయిబాబా వైద్య ఖర్చులు భరించలేని పరిస్థితిలో ఉన్నారు. సహృదయులు ముందుకు వచ్చి సహాయం అందించాలని ఆయన కోరుతున్నారు. సహాయం చేయదలచిన వారు ఫోన్/ఫోన్‌పే/గూగుల్ పే నంబర్: 7989087488 ద్వారా అందజేయవచ్చు.

## ప్రజా నమ్మకాన్ని నిలబెట్టాలి ప్రజావాణి పై అధికారులకు అదనపు కలెక్టర్ సూచనలు



**మేడ్చల్–మల్కాజిగిరి కలెక్టర్, నవంబర్ 17 (తెలంగాణ ముచ్చట్లు):** మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులను వేగంగా పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ రాధికా గుప్తా సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి, డీఆర్ఓ హరిప్రియతో కలిసి ప్రజల నుండి వచ్చిన 109 దరఖాస్తులు స్వీకరించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ రాధికా గుప్తా మాట్లాడుతూ—— ప్రజలు తమ సమస్యలకు పరిష్కారం పొందాలనే నమ్మకంతో ప్రజావాణిని ఆశ్రయిస్తున్నారని, ఆ నమ్మకాన్ని నిలబెట్టాల్సిన బాధ్యత అధికారులపై ఉందని అన్నారు. దరఖాస్తులను పరిశీలించడంలో ఎలాంటి జాప్యం లేకుండా వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అదేవిధంగా, తిరస్కరించే దరఖాస్తుల విషయంలో తిరస్కరణకు గల కారణాలను స్పష్టంగా అర్జీదారులకు తెలియజేయాలి అని సూచించారు. స్వీకరించిన దరఖాస్తులపై తీసుకున్న చర్యల వివరాలను ఆన్‌లైన్‌లో వెంటవెంటనే నమోదు చేయాలని సంబంధిత శాఖలకు ఆదేశాలు జారీ చేశారు.కార్యక్రమంలో పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు

# కాప్రా చెరువు వద్ద శానిటేషన్ సిబ్బంది కార్తీక దీపోత్సవం






**కాప్రా, నవంబర్ 17 (తెలంగాణ ముచ్చట్లు):** కార్తీక మాసం చివరి సోమవారం పర్వదినాన్ని పురస్కరించుకుని జీహెచ్ఎంసీ కాప్రా సర్కిల్ శానిటేషన్ విభాగం ఆధ్వర్యంలో కాప్రా చెరువు వద్ద కార్తీక దీపోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. చెరువు ప్రాంగణం దీపాలతో కళకళలాడింది.ఈ సందర్భంగా శానిటేషన్ సూపర్వైజర్ సుదర్శన్ మాట్లాడుతూ పూర్వకాలంలో ఋషులు వాతావరణ మార్పుల కారణంగా వ్యాధులు రాకుండా దీపాలు వెలిగించేవారని, దీపాల వెలుగు పరిసరాల్లో క్రిమికీటకాలను తగ్గిస్తుందని పురాణాల్లో ఉన్న విశ్వాసాన్ని వివరించారు. పరిశుభ్రత పాటించకపోవడం వల్లే ఎక్కువ రోగాలు వ్యాపిస్తున్నాయని, ప్రజలు చెత్తను రోడ్లపై లేదా ఖాళీ స్థలాల్లో వేయకుండా జీహెచ్ఎంసీ ఆటోలు, రిక్షాలను వినియోగించాలని పిలుపునిచ్చారు.ఈకార్యక్రమంలో డీసీ జగన్, డీ.ఎస్.డబ్ల్యు.ఎం. గోపాల్, ఏ.ఎం.ఓ.హెచ్. మధుసూదన్, రాంకీ సూపర్‌వైజర్ నవీన్ రెడ్డి, ఎస్.ఎఫ్.ఏలు, శానిటేషన్ జవాన్లు, డ్రైవర్లు మరియు ఇతర పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

# మహిళలకు కుట్టు మిషన్లను పంపిణీ చేసిన రజిత పరమేశ్వర్ రెడ్డి






**ఉప్పల్, నవంబర్ 17 (తెలంగాణ ముచ్చట్లు)** ఉప్పల్ విజయపురి కాలనీలో లావణ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కుట్టు మిషన్ శిక్షణ కార్యక్రమం ఘనంగా ముగిసింది. శిక్షణ పూర్తిచేసుకున్న మహిళలకు సర్టిఫికెట్లు అందజేయడంతో పాటు లక్కీ డ్రాలో విజేతలైన మహిళలకు కుట్టు మిషన్లను ఉప్పల్ కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి పంపిణీ చేశారు.ఈ సందర్భంగా రజిత పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, “మహిళల అభివృద్ధి కోసం తెలంగాణ ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోంది. ఉచిత బస్సు ప్రయాణం, మహాలక్ష్మి పథకం కింద 500 రూపాయలకు గ్యాస్ సిలిండర్ అందజేయడం, చిన్న వ్యాపారాలు చేసే మహిళా పారిశ్రామికవేత్తలకు వడ్డీలేని రుణాల కోసం ఉద్యోగిని పథకం వంటి అనేక కార్యక్రమాలు ఎంతోమందికి ఉపయోగపడుతున్నాయి” అని పేర్కొన్నారు. మహిళలు అన్ని రంగాలలో ముందుకు వచ్చి అభివృద్ధి సాధించాలని ఆమె పిలుపునిచ్చారు. కార్యక్రమంలో లావణ్య ఫౌండేషన్ ఫౌండర్ లావణ్య, ఉప్పల్ ఏ బ్లాక్ మహిళా అధ్యక్షురాలు అమరేశ్వరి, టీచర్లు వాణి, మాధురి, సంధ్య, విజయపురి కాలనీ అధ్యక్షుడు లింగారెడ్డి, సల్ల ప్రభాకర్ రెడ్డి, సుంకు శేఖర్ రెడ్డి, రాములు, బొడిగె మల్లేష్, అన్వర్ భాష తదితరులు పాల్గొన్నారు.

# పశుపతినాథ్ దేవస్థానంలో కార్తీక సోమవారం ప్రత్యేక పూజలు

- **సామూహిక పంచామృత మహారుద్రాభిషేకం**
- **సాయంత్రం ఆకాశ దీపార్చన**





**ఎల్కతుర్తి, నవంబర్ 17 (తెలంగాణ ముచ్చట్లు):** ఎల్కతుర్తి మండలం వల్భాపూర్ గ్రామంలోని శ్రీ పశుపతినాథ్ దేవాలయంలో కార్తీకమాసం చివరి సోమవారం సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం బ్రహ్మముహూర్తం నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకొని పంచామృతంతో సామూహిక మహా రుద్రాభిషేకంలో పాల్గొన్నారు.

వేదపండితులు సదానిరంజన్ సిద్ధాంతి ఆధ్వర్యంలో మంత్రోచ్చారణల మధ్య స్వామివారికి బిల్వదళాలతో అర్చనలు జరగగా, ఆలయం ఆవరణం “ఓం నమః శివాయ”, “ఓం శ్రీ పశుపతినాథాయ నమః” నినాదాలతో మార్మోగింది. మహిళా భక్తులు దీపాలు వెలిగించి స్వామివారి దర్శనం చేసుకున్నారు.

సాయంత్రం ఆరు గంటలకు ఆకాశదీప ప్రజ్వలన, ఈశ్వరలింగ దీపార్చన, అష్టోత్తర శతనామార్చన ఘనంగా నిర్వహించారు. కార్యక్రమం అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

కార్తీకమాసం చివరి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించడం పుణ్యప్రదమని అర్చకులు తెలిపారు. ఈ కార్యక్రమాల నిర్వహణలో శివాలయ కమిటీ, యువకులు, మహిళా భక్తులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




## సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే మర్రి

**మల్కాజిగిరి, నవంబర్ 17 (తెలంగాణ ముచ్చట్లు):** మల్కాజిగిరి డివిజన్‌కు చెందిన పలువురు అనారోగ్యంతో బాధపడుతూ వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధికి చేసిన దరఖాస్తులపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. ఈ మేరకు మొత్తం రూ. 1,02,000 రూపాయల ఆర్థిక సాయం మంజూరయ్యింది.సహాయ నిధి కింద చెక్కులు పొందిన వారు:చుక్క మల్లేష్ రూ.
60,000,మేహునిసా బేగం రూ .15,000,నందు కుమార్ రూ.27,000.సోమవారం బోయిన్‌పల్లి ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్‌లో శాసనసభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ జగదీష్ గౌడ్ తో కలిసి బాధితులకు చెక్కులను అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ,“సీఎం సంక్షేమ సహాయనిధి పేదలు అనారోగ్యానికి గురైన సమయంలో వారికి ఆపన్న హస్తంలా ఉపయోగపడుతోంది. ప్రతి అర్హుడికి ప్రభుత్వం అండగా ఉంటుంది” అని అన్నారు.నిరుపేదల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపుతూ వారి సంక్షేమానికి ఎల్లప్పుడూ కృషి చేస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డికి లబ్ధిదారుల కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు బద్ధం పరశురాం రెడ్డి, అనిల్ కిషోర్, కరంచంద్, జనార్ధన్, తులసి సురేష్, సంతోష్, బాలకృష్ణ, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

## దేవరకద్ర ఎమ్మెల్యేను కలిసి వివాహానికి ఆహ్వానించిన హంసు వర్మ

**దేవరకద్ర,నవంబర్17(తెలంగాణ ముచ్చట్లు):** దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డిని హైకోర్టు ఏ.జి.పి డి.హంసు వర్మ సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి తన వివాహానికి ఆహ్వానించారు. ఈ నెల 30వ తేదీ (ఆదివారం) కొత్త కోట పోలీస్ స్టేషన్ సమీపంలోని ఏటీఆర్ ఫంక్షన్ హాలులో జరిగే వివాహ మహోత్సవానికి హాజరుకావాలని ఆయన నివాసంలో కలిసి ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రికను అందజేశారు.

వివాహానికి తప్పకుండా హాజరవుతానని ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి సానుకూలంగా స్పందించారని హంసు వర్మ తెలిపారు. ఈ కార్యక్రమంలో మధునాపూర్ మార్కెట్ యార్డ్ చైర్మన్ పల్లెపాగు ప్రశాంత్ పాల్గొన్నారు.






## మల్కాజ్గిరి జిల్లా ఆసుపత్రినీ సందర్శించిన రాధికా గుప్తా

◆ యుఐడిఐ పనుల పురోగతిపై నివేదికలు సమర్పించాలని ఆదేశాలు

**మల్కాజ్‌గిరి, నవంబర్ 17 (తెలంగాణ ముచ్చట్లు):** మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా అదనపు కలెక్టర్ రాధికా గుప్తా యుఐడిఐ పనుల పురోగతిని పరామర్శించేందుకు మల్కాజ్‌గిరి జిల్లా ఆసుపత్రిని సందర్శించారు. ఆసుపత్రిలో జరుగుతున్న యుఐడిఐ సంబంధిత కార్యక్రమాలు, రికార్డు నిర్వహణ వివరాలు, సేవల ప్రగతి గురించి అధికారులు ఆమెకు నివేదించారు. అనంతరం అదనపు కలెక్టర్ రాధికా గుప్తా స్పష్టమైన పురోగతి నివేదికలను ప్రతిరోజూ సమర్పించాలని ఆదేశించారు.ఈ పర్యటనలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సునీత, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రాధ, ఏఓ డాక్టర్ సంగీత్ కుమార్, డీఆర్‌డీవో సాంబశివరావు, వైద్యులు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.




## పాత బ్యాంక్ ఖాతాలోని నగదు మర్చిపోయారా.. ఇలా క్లెయిం చేసుకోండి!

రిజర్వ్ బ్యాంక్ ఏం చెప్తున్నది ఏండ్ల తరబడి ఎలాంటి లావాదేవీలు లేకుండా నిష్క్రియంగా ఉన్న మీ బ్యాంక్ ఖాతాల్లోని నగదును తిరిగి ఇప్పటికీ పొందవచ్చు. అందుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఖాతాదారులకు సహాయం చేస్తున్నది. ఖాతాలోని నగదు పదేండ్లకుపైగా అలాగే ఉంటుంటే ఆ సొమ్ము.. ఆర్బీఐ డిపాజిటర్ ఎడ్యుకేషన్ అండ్ అవేర్‌నెస్ (డీఈఏ) ఫండ్‌లో ఉండవచ్చు. దీన్ని క్లెయిం చేసుకోవడానికి ఇలా ప్రయత్నించండి. ముందుగా మీ బ్యాంక్ శాఖనుగానీ, ఆ బ్యాంక్‌కు చెందిన ఏదైనా శాఖనుగానీ సంప్రదించవచ్చు.ఆధార్, పాస్‌పోర్ట్, ఓటర్ ఐడీ, డ్రైవింగ్ లైసెన్స్ తదితర కేవైసీ పత్రాలతో ఫారంను సమర్పించాలి.సదరు సొమ్ము మీదే అని తేలితే వడ్డీతో సహా బ్యాంక్ చెల్లించే వీలున్నది. చివరగా.. పిల్లల భవిష్యత్తు కోసం పెద్దవాళ్లు (తల్లిదండ్రులు) బ్యాంక్ ఖాతాల్లో తమ కష్టార్జితాన్ని దాచడం, డిపాజిట్లు చేయడం సహజమే. అయితే దురదృష్టవశాత్తు డిపాజిట్‌దారులు చనిపోతే ఆ సొమ్ము గురించి వారసులకు తెలియని పరిస్థితి. ఇలాంటప్పుడు బ్యాంక్ ఖాతాలు, డిపాజిట్లకు సంబంధించిన ఏ సమాచారమున్నా ఆయా బ్యాంక్ వెబ్‌సైట్లలో వెతకవచ్చు. ఆర్బీఐ ఉద్గమ్ పోర్టల్‌లోనూ చూసుకోవచ్చు. ఈ డిసెంబర్‌దాకా అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్ల పరిష్కారానికి దేశవ్యాప్తంగా ఆర్బీఐ ప్రత్యేక శిబిరాలనూ నిర్వహిస్తున్నది. వీటి ద్వారా కూడా మన సొమ్మును మనం తిరిగి పొందే అవకాశాలున్నాయి.

## ఉద్యోగులకు ఈపీఎఫ్ సంస్థ నుంచి భారీగుడ్ న్యూస్..!




పిఎఫ్ ఉద్యోగుల కనీస పెన్షన్ మొత్తం పెరగనుంది. ఉద్యోగుల పెన్షన్ పథకంలోని కనీస పెన్షన్ పెంపు ప్రకటన కేంద్ర ప్రభుత్వంనుంచి ఎప్పుడైనా రావొచ్చు. దీనివల్ల పెద్ద సంఖ్యలో ఉద్యోగులకు లాభం చేకూరుతుంది. పెన్షన్ పథకం కింద నెలకు కనీస పెన్షన్‌ను రూ.5, 500కు పెంచే అవకాశం ఉందని భావిస్తున్నారు. ప్రస్తుతం నెలకు రూ.1,000 మాత్రమే అందుతోంది. ఇది అమల్లోకి వస్తే కనీస పెన్షన్ రూ.4,500 మేర పెరుగుతుంది. ఉద్యోగి సంఘాలు ఈ పెంపును డిమాండ్ చేస్తున్నాయి. రాబోయే విశ్వస్థుల మండలి సమావేశంలో దీనిని ఆమోదించే అవకాశముంది. అయితే ఇంకా అధికారిక ప్రకటన వెలువడలేదు. ఉద్యోగుల పెన్షన్ పథకం కింద రూ.1,000 కనీస పెన్షన్ అందుతోంది. దీన్ని పెంచాలని చాలా కాలంగా డిమాండ్ కొనసాగుతోంది. ఈ ప్రతిపాదనను మండలి సమావేశంలో ఆమోదించవచ్చు. ప్రస్తుతం దాదాపు 78 లక్షల మంది ఉద్యోగులు ఈ పథకం ప్రయోజనాలను పొందుతున్నారు. ఉద్యోగి సంఘాలు పెన్షన్ పెంపు కోరుతూ కార్మిక-ఉపాధి శాఖకు విజ్ఞప్తి కూడా చేశాయి. అయితే ప్రభుత్వం ఇంకా అంగీకారం తెలపలేదు. ప్రభుత్వం ఏవైనా మార్పులు చేస్తే అది 11 సంవత్సరాల తర్వాత జరుగుతున్న పెంపు అవుతుంది. చివరిసారిగా 2014లో కనీస పెన్షన్‌ను రూ.1,000కి పెంచారు. ఈ పథకం కింద పెన్షన్ పొందడానికి కొన్ని అర్హతలు ఉన్నాయి. ఉద్యోగి కనీసం ఈ సంస్థ సభ్యుడిగా ఉండాలి. పెన్షన్ ప్రయోజనాలు 58 సంవత్సరాల తరువాత ప్రారంభమవుతాయి. ప్రస్తుతం ఈ సంస్థ అనేక లక్షల మంది ఉద్యోగులకు నెలవారీ పెన్షన్‌లు అందిస్తోంది.





# గ్లోబల్ సమ్మిట్ వేదిక పరిశీలించిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క


**మేడ్చల్–మల్కాజిగిరి, నవంబర్ 17 (తెలంగాణ ముచ్చట్లు):** డిసెంబర్-2025లో జరగనున్న గ్లోబల్ సమ్మిట్‌కు వేదికను నిర్ణయించేందుకు దుండిగల్ మండలంలోని ప్రభుత్వ భూములను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా సర్వే నంబర్లు 453, 454 పరిధిలోని భూములు సమ్మిట్ నిర్వహణకు అనుకూలమా అనే అంశంపై అధికారులు సమక్షంలో సమావేశం నిర్వహించారు.ఈ పరిశీలనలో స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేష్ రంజన్ (ఐఏఎస్), జిల్లా కలెక్టర్ మను చౌదరి (ఐఏఎస్), సీనియర్ అధికారి ఈ.వి. నర్సింహా రెడ్డి (ఐఏఎస్) పాల్గొన్నారు.ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ, “తెలంగాణ రైసింగ్ - విజన్ 2047లో భాగంగా రాష్ట్రాన్ని అంతర్జాతీయ పెట్టుబడుల కేంద్రంగా తీర్చిదిద్దుతున్నాం. తెలంగాణ ప్రజల కోసం మాత్రమే కాకుండా, ప్రపంచవ్యాప్తంగా ఉన్న పెట్టుబడిదారులను ఆకర్షించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. హైదరాబాద్ అనుకూల వాతావరణం, నైపుణ్యం కలిగిన మానవ వనరులు పెట్టుబడుల పెరుగుదలకు దోహదపడుతున్నాయి” అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి, ఆర్డీఓ టి. శ్యామ్ ప్రకాశ్, సంబంధిత శాఖాధికారులు పాల్గొన్నారు.

# భారీగా పడిపోయిన టాటా స్టాక్..




టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికిల్స్ లిమిటెడ్ షేర్లు సోమవారం సెషన్‌లో ఒక్కసారిగా కుదేలయ్యాయి. కిందటి సెషన్‌లో ఈ స్టాక్ ధర రూ. 391.20 వద్ద ముగియగా.. ఇవాళ దాదాపు 2 శాతానికిపైగా నష్టంతో సెషన్ ప్రారంభించింది. అంతటితో ఆగకుండా ఇంట్రాడేలో ఒక దశలో ఏకంగా 7 శాతానికిపైగా పతనమై రూ. 363 వద్ద సెషన్ కనిష్టాన్ని నమోదు చేసింది.ప్రస్తుతం వార్త రాసే సమయంలో (మధ్యాహ్నం 1.30 గంటలకు) 5 శాతం నష్టంతో రూ. 370 స్థాయిలో కదలాడుతోంది. ఇవాళ నమోదు చేసిన రూ. 363 స్టాక్ 52 వారాల కనిష్ట ధర. స్టాక్ 52 వారాల గరిష్ట ధర రూ. 419 గా ఉంది. ఇక ఈ కంపెనీ మార్కెట్ విలువ రూ. 1.44 లక్షల కోట్లుగా ఉంది. గత కొద్ది రోజులుగా చూస్తే ఈ స్టాక్ పతనం అవుతూనే ఉంది.5 రోజుల్లో 8 శాతానికిపైగా ధర తగ్గింది. నెల వ్యవధిలో 5 శాతం పతనమైంది. 6 నెలల్లో 15 శాతానికిపైగా నష్టపోయింది. ఈ ఏడాదిలో ఇప్పటివరకు 17 శాతానికిపైగా పడిపోయింది.ఏడాదిలో 20 శాతం తగ్గింది. ఐదేళ్ల వ్యవధిలో మాత్రం ఈ స్టాక్ 265 శాతం వరకు పుంజుకుంది.స్వల్ప వ్యవధిలో మాత్రం నష్టాల్నే మిగిల్చింది.ఇక్కడ షాకింగ్ విషయం ఏంటంటే.. తాజాగా ఈ కంపెనీ 202526 ఆర్థిక సంవత్సరంలో క్యూ2 (జులై సెప్టెంబర్ త్రైమాసికం) ఫలితాల్ని ప్రకటించింది. ఇక్కడ ఏకీకృత ప్రాతిపదికన నికర లాభం రూ. 76,170 కోట్లుగా నమోదైంది. అంతకుముందు ఆర్థిక సంవత్సరం ఇదే సమయంతో పోలిస్తే లాభం ఇక్కడ రికార్డు స్థాయిలో 2110 శాతం పెరిగింది. అయితే ఇక్కడే చిన్న సాంకేతిక సర్దుబాటు ఉంది. వన్ టైమ్ నోషనల్ గెయిన్ రూ. 82,616 కోట్లుగా ఉంది. లేకపోతే వాస్తవానికి ఇక్కడ నష్టం రూ. 6,368 కోట్లుగా రావాల్సి ఉంది. ఇది అంతకుముందు ఆర్థిక సంవత్సరం ఇదే సమయంలో ఉన్న రూ. 3056 కోట్లతో పోలిస్తే చాలా తక్కువ. ఓవరాల్ రెవెన్యూ 13.5 శాతం తగ్గి రూ. 72,349 కోట్లుగా నమోదైంది.ప్రధానంగా తన లగ్జరీ వెహికిల్ బిజినెస్ అయిన జాగ్వార్ ల్యాండ్ రోవర్ సేల్స్ క్షీణించడంతోనే జరిగిందని తెలిసింది. ఆ మధ్య జరిగిన సైబర్ ఇన్సిడెంట్.. అమ్మకాలపై ప్రభావం చూపిందని కంపెనీ పేర్కొంది. ఈ నేపథ్యంలోనే పలు బ్రోకరేజీలు ఈ స్టాక్ రేటింగ్ తగ్గిస్తున్నాయి. దీంతో ఇన్వెస్టర్లు షేర్లను విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. టాటా మోటార్స్.. ఇటీవల 2 కంపెనీలుగా విడిపోయిన సంగతి తెలిసిందే. టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికిల్స్, ఎలక్ట్రిక్ వెహికిల్స్, జాగ్వార్ ల్యాండ్ రోవర్ కలిసి.. టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికిల్స్ లిమిటెడ్‌గా మారగా.. కమర్షియల్ వాహన విభాగం టాటా మోటార్స్ లిమిటెడ్ (టాటా మోటార్స్ కమర్షియల్ వెహికిల్స్ లిమిటెడ్) అయింది. అక్టోబర్ 1 నుంచే కంపెనీ విభజన అమల్లోకి వచ్చింది. ఇక్కడ షేర్లు సర్దుబాటు అయ్యాయి.ఇటీవలే టాటా మోటార్స్ కమర్షియల్ లిమిటెడ్ స్టాక్ కూడా లిస్టింగ్ అయ్యింది. ఇక్కడ అక్టోబర్ 14లోపు టాటా మోటార్‌స్‌లో ఈక్విటీ షేర్లు ఉన్న వారికి అంతే మొత్తంలో షేర్లు కూడా వచ్చాయి. ఈ స్టాక్ మాత్రం 30 శాతం వరకు ప్రీమియం నమోదు చేసింది. ఇవాళ కూడా ఇంట్రాడేలో 2 శాతానికిపైగా పెరిగి రూ. 325 స్థాయిలో ట్రేడవుతోంది.

# దివాలా తీసిన బైజూస్ కొనుగోలుకు మరో ప్రయత్నం




దివాలా తీసిన బైజూస్‌ను కొనుగోలు చేయడానికి మణిపాల్ గ్రూప్ తన బిడ్‌ను కొనసాగించింది. దివాలా ప్రక్రియ కింద బైజూస్ మాతృ సంస్థ థింక్ అండ్ లెర్న్ ప్రైవేట్ లిమిటెడ్‌ను కొనుగోలు చేయడానికి మణిపాల్ ఎడ్యుకేషన్ అండ్ మెడికల్ గ్రూప్ రెండవ బిడ్‌ను సమర్పించింది. ఇది బైజూస్ రిజల్యూషన్ ప్రొఫెషనల్కి ఆసక్తి వ్యక్తీకరణను సమర్పించింది. రంజన్ పాయ్ యాజమాన్యంలోని మణిపాల్ గ్రూప్ బైజూస్‌ను కొనుగోలు చేయడానికి బిడ్ దాఖలు చేయడం ఇది రెండోసారి. బిడ్డర్లు లేకపోవడంతో, ఆర్‌పి కొత్త బిడ్‌లను ఆహ్వానించింది. దీనికి చివరి రోజు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం.. బైజూస్‌ను కొనుగోలు చేయడానికి మణిపాల్ గ్రూప్ మాత్రమే బిడ్ సమర్పించింది. ఆకాష్ ఎడ్యుకేషన్ పై మణిపాల్ గ్రూప్ దృష్టి బైజూస్ అప్పుల భారం దృష్ట్యా, కోర్టు ఆదేశాల మేరకు ఒక పరిష్కారం కోసం వెతకడం జరిగింది. దీని ప్రకారం.. బైజూస్ ఆస్తులను విక్రయించి అప్పు చెల్లించడానికి ఒక రిజల్యూషన్ ప్రొఫెషనల్‌ను ఎంపిక చేశారు. ఇప్పుడు ఆయనను బిడ్డింగ్‌కు ఆహ్వానించారు. మణిపాల్ గ్రూప్ బైజూస్ కంటే ఆకాష్ ఎడ్యుకేషన్ సర్వీసెస్ కంపెనీపై దృష్టి పెట్టింది. బైజూస్ 2021లో ఆకాష్ కంపెనీని కొనుగోలు చేసింది. కోచింగ్ రంగంలో ప్రసిద్ధి చెందిన ఆకాష్ కంపెనీని కొనుగోలు చేయడానికి మణిపాల్ గ్రూప్ ఆసక్తి చూపుతోంది. రంజన్ పాయ్ బైజూస్ రుణాలలో కొన్నింటిని చెల్లించాడు. ప్రతిగా ఆకాష్ కంపెనీ. 40 శాతం వాటా ఇవ్వబడింది.ఇప్పుడు బైజూస్‌ను కొనుగోలు చేయడం ద్వారా, మణిపాల్ గ్రూప్ ఆకాష్ ఎడ్యుకేషన్ సర్వీసెస్‌పై పూర్తి నియంత్రణను పొందుతుంది. దాని కొనుగోలుకు బిడ్డర్ కూడా అదే. అయితే ఈ కారణంగానే కొనుగోలు సాధ్యమవుతుందని ఎటువంటి హామీ లేదు. ప్రతిదీ విచక్షణా నిర్ణయంపై కూడా ఆధారపడి ఉండవచ్చు.

## అమెరికా నుంచి ఎల్‌పీజీ దిగుమతి..

# అందుబాటు ధరలో వంటగ్యాస్..!



దేశంలో ఇంధన భద్రతను బలోపేతం దిశగా కేంద్రం ముందడుగు వేసింది. ఇందుకోసం అమెరికా నుంచి లిక్విడ్ పెట్రోలియం గ్యాస్ గుమతి చేసుకోవడానికి గానూ.. భారత్ మొదటి నిర్మాణాత్మక, దీర్ఘకాలిక ఒప్పందంపై సంతకం చేసింది. ఈ చరిత్రాత్మక ఒప్పందం గురించి కేంద్ర పెట్రోలియం, సహజ వాయు శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురీ ప్రకటించారు .ఈ ఒప్పందంలో భాగంగా 2026 ఏడాదికి యూఎస్ గల్ఫ్ కోస్ట్ నుంచి 2.2 మిలియన్ టన్నుల ఎల్‌పీజీని దిగుమతి చేసుకోనున్నట్టు మంత్రి తెలిపారు. ఇది దేశంలోని వార్షిక దిగుమతుల్లో సుమారు 10 శాతానికి సమానం. దీనివల్ల దేశ ప్రజలకు అందుబాటు ధరకే ఎల్‌పీజీ అందించేందుకు మార్గం సుగమం కానుందని ఆయన అన్నారు. ఈ విషయమై కొన్ని నెలలుగా.. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ , భారత పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ , హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ కంపెనీలకు చెందిన అధికారుల సంయుక్త బృందం.. అమెరికా ఉత్పత్తిదారులతో చర్చలు జరిపినట్టు పురీ వెల్లడించారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



## గూగుల్ పిక్సెల్ 9 ఫోన్‌పై రూ.25 వేల తగ్గింపు..!

మీరు గూగుల్ పిక్సెల్ 9 కొనాలని చూస్తున్నట్లయితే అది గణనీయమైన తగ్గింపుతో లభిస్తుంది. మీరు చాలా కాలంగా దానిని కొనాలని ప్లాన్ చేస్తుంటే అధిక ధర కారణంగా వాయిదా వేస్తూ ఉంటే ఇప్పుడు తక్కువ ధరల్లోనే కొనుగోలు చేయవచ్చు. ఫ్లిప్‌కార్ట్ వింటర్ బొనాంజా సేల్ సమయంలో మీరు ఈ ఫోన్‌లో రూ.25,000 వరకు ఆదా చేసుకోవచ్చు. ఫోన్ ఫీచర్లు, డీల్‌ల గురించి తెలుసుకుందాం.

గూగుల్ పిక్సెల్ 9 ఫీచర్లు:

గూగుల్ నుండి వచ్చిన ఈ ప్రీమియం స్మార్ట్‌ఫోన్ అనేక ఆకట్టుకునే ఫీచర్లతో ప్రారంభించింది. ఇది 120Hz రిఫ్రెష్ రేట్, 2700 నిట్స్ పీక్ బ్రైట్‌నెస్‌తో 6.3 అంగుళాల OLED డిస్‌ప్లేను కలిగి ఉంది. ఇది 12GB RAM+ 256GB నిల్వతో జత చేయబడిన టెన్సర్ G4 ప్రాసెసర్ ద్వారా శక్తిని పొందుతుంది. ఈ ఫోన్ ఆండ్రాయిడ్ 14 ఆపరేటింగ్ సిస్టమ్‌తో ప్రారంభించింది. ఇది ఆండ్రాయిడ్ 16కి అప్‌గ్రేడ్ చేయగలదు. గూగుల్ ఈ ఫోన్‌కు ఏడు సంవత్సరాల పాటు సాఫ్ట్‌వేర్ అప్‌డేట్‌లను అందిస్తుంది.

గూగుల్ పిక్సెల్ 9 లో డ్యూయల్ రియర్ కెమెరా సెటప్ ఉంది. ఇందులో 50MP ప్రైమరీ సెన్సార్, 48MP అల్ట్రావైడ్ లెన్స్ ఉన్నాయి. ముందు భాగంలో సెల్ఫీలు, వీడియో కాల్స్ కోసం 10.5MP కెమెరా ఉంది. ఈ ఫోన్ 4700mAh బ్యాటరీని కలిగి ఉంది. ఇది 27W వైర్డు ఫాస్ట్ ఛార్జింగ్, వైర్‌లెస్ ఛార్జింగ్‌కు మద్దతు ఇస్తుంది గూగుల్ ఈ ఫోన్‌ను రూ.79,999 ధరకు లాంచ్ చేసింది. కానీ ఇప్పుడు ఇది 31 శాతం తగ్గింపు తర్వాత రూ.54,999కి లిస్ట్ చేసింది. దీని అర్థం వినియోగదారులు ఫోన్‌పై రూ.25,000 ఆదా చేసుకోవచ్చు. ఎంపిక చేసిన కార్డ్‌లపై 5% క్యాష్‌బ్యాక్ కూడా అందుబాటులో ఉంది. వినియోగదారులు తమ పాత ఫోన్‌ను మార్పిడి చేసుకోవడం ద్వారా ఎక్స్ఛేంజ్ ఆఫర్‌ను కూడా పొందవచ్చు.




## అల్లు అర్జున్ ఫోన్ వాల్‌పేపర్ గమనించారా..?

**ఆ రూల్‌నే ఫాలో అవుతామంటున్న ఫ్యాన్స్**

టాలీవుడ్ స్టార్ యాక్టర్ అల్లు అర్జున్ ప్రస్తుతం కోలీవుడ్ డైరెక్టర్ అట్లీ దర్శకత్వంలో సినిమా చేస్తున్నాడని తెలిసిందే. AA22xA6 (వర్కింగ్ టైటిల్) ప్రాజెక్ట్‌గా వస్తున్న ఈ మూవీ షూటింగ్ దశలో ఉంది. బాలీవుడ్ భామ దీపికా పదుకొనే ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తుంది. అల్లు అర్జున్‌కు సంబంధించిన ఓ విషయం ఇప్పుడు టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా మారింది.అల్లు అర్జున్ వ్యక్తిగత జిమ్ ట్రైనర్ లియోర్డ్ స్టీవెన్స్ ఇన్‌స్టాగ్రామ్‌లో చిన్న వర్కవుట్ క్లిప్‌ను పోస్ట్ చేశాడు. ఈ వీడియోలో ట్రేడ్ మిల్‌పై ఉన్న అల్లు అర్జున్ ఫోన్ వాల్‌పేపర్ అందరి దృష్టిని ఆకర్షిస్తుంది. ఈ క్లిప్ ఆదివారం ఉదయం 10:18 గంటల(నవంబర్ 16, 2025)కు క్లిక్‌మనిపించింది కాగా టైం కింద 2026 మార్చి 27 కూడా ఉంది. వాల్‌పేపర్‌పై నో స్నాక్ నో షుగర్ నో సోడా అనే మూడు సింపుల్ లైన్స్ ఉన్నాయి.ఇక లైన్స్ ఈ లైన్స్ చదివిన అభిమానులు అల్లు అర్జున్ 2026 మార్చి 27 వరకు నో స్నాక్ నో షుగర్ నో సోడా నిబంధనను ఫాలో అవుతాడని క్లారిటీకి వచ్చేస్తున్నారు. అల్లు అర్జున్ క్రమశిక్షణ, ఖచ్చితత్వానికి ఇంప్రెస్ అయిన అభిమానులు తాము కూడా అదే రూల్‌ను ఫాలో అవుతామని చెబుతున్నారు. అట్లీతో బన్నీ చేయబోయే సినిమా 2027లో పూర్తవుతుందని హింట్ ఇచ్చిన మేకర్స్ ఎప్పటివరకు అనేది మాత్రం స్పష్టత ఇవ్వలేదు. సన్ పిక్చర్స్ బ్యానర్‌పై కళానిధి మారన్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి సాయి అభ్యాంకర్ మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు.

## షార్ట్-టర్మ్ హెల్త్ ఇన్సూరెన్స్‌తో లాభాలేంటి? నష్టాలేంటి?

షార్ట్‌టర్మ్ ఆరోగ్య బీమా కవరేజీని కల్పిస్తుంది. సాధారణంగా ఇది కొద్ది నెలల నుంచి ఏడాదిదాకే ఉంటుంది. ఎవరైతే స్టాండర్డ్ హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీలతో వచ్చే దీర్ఘకాలిక ఆరోగ్య బీమాలు కాకుండా తక్షణ కవరేజీలను కోరుకుంటారో వారినుద్దేశించినదే ఈ పాలసీ. సమగ్ర కవరేజీని కొనలేనివారికి ఇది ఉపయుక్తంగా ఉంటుంది. కంపెనీల్లో గ్రూప్ ఇన్సూరెన్స్ కోసం వేచిచూస్తున్న ఉద్యోగులు, నిరుద్యోగులకు దీని అవసరం ఎక్కువని చెప్పవచ్చు.

లాభాలు: తక్కువ ప్రీమియం, కనీస ఆరోగ్య సమాచారంతోనే కొనుగోలు, సులభంగా ప్లాన్ల మార్పు, నష్టాలు:ఇప్పటికే ఉన్న ఆరోగ్య సమస్యలకు నో కవరేజీ, ఎంపిక చేసిన నెట్‌వర్క్‌లో తప్ప.. అన్ని దవాఖానల్లో చెల్లవు, యాడ్‌ఆన్‌లు అందుబాటులో ఉండవు




## టీసీఎస్ లేఆఫ్స్‌లో ట్విస్ట్.. వేలల్లో ఉద్యోగుల తొలగింపు!

భారత ఐటీ రంగంలో మార్కెట్ విలువ పరంగా అతిపెద్ద కంపెనీ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్‌కు కష్టాలు ఎదురవుతూనే ఉన్నాయి. ఆ మధ్య త్రైమాసిక ఫలితాల్ని ప్రకటించిన సమయంలో.. ఉద్యోగుల తొలగింపునపై కూడా ప్రకటన చేసింది. దాదాపు 2 శాతం వరకు ఉద్యోగుల్ని తొలగిస్తున్నట్లు ప్రకటించింది. ఈ సంఖ్య సుమారు 20 వేల వరకు ఉందని పలు మీడియాల్లో కథనాలు వచ్చాయి. టీసీఎస్ ఉద్యోగుల సంఖ్య మొత్తంగా త్రైమాసికం ప్రాతిపదికన చూస్తే.. 20 వేల మంది వరకు తగ్గినట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఇదే ఇప్పుడు ఆ సంస్థను చిక్కుల్లో పడేసింది. తమ ఉద్యోగుల తొలగింపు విధానాల కారణంగా వివాదంలో చిక్కుకుంది. ఇప్పుడు పుణె లేబర్ కమిషనర్ నుంచి టీసీఎస్‌కు సమన్లు జారీ అయ్యాయి.ఐటీ ఉద్యోగుల సంఘం అయిన నాసెంట్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఎంప్లాయీస్ సెనేట్ నుంచి ఎన్నో ఫిర్యాదులు అందాయి. ఈ నేపథ్యంలో లేబర్ కమిషనర్ చర్య తీసుకుంది. బాధిత ఉద్యోగుల నుంచి ఫిర్యాదులు వచ్చినట్లు పేర్కొంది. గత కొన్ని నెలలుగా టీసీఎస్ ఉద్యోగుల నుంచి పెద్ద సంఖ్యలో ఫిర్యాదులు వచ్చినట్లు తెలిపింది.ఫిర్యాదుల్లో ప్రధాన అంశాల విషయానికి వస్తే.. ఆకస్మిక తొలగింపులు, బలవంతంగా రాజీనామాలు చేయించడం, చట్టబద్ధంగా రావాల్సిన బకాయిల్ని నిరాకరించడం, నియంతృత్వ విధానాలు వంటివి ఉన్నట్లు వివరించింది. తమకు అందిన డాక్యుమెంటేషన్‌ను సమీక్షించిన తర్వాతే అధికారులకు ఫిర్యాదులు దాఖలు చేసేందుకు ఉద్యోగులకు సహాయం చేసినట్లు నైట్స్ స్పష్టం చేసింది. ఇక్కడ అధికారుల చర్యలు.. 'ప్రతి యజమాని చట్టబద్ధమైన ప్రక్రియను పాటించాలి, కార్మిక చట్టాల్ని ఉల్లంఘించొద్దనే దానిని' బలపరుస్తున్నట్లు పేర్కొంది.ఈ విషయంపై నవంబర్ 18న విచారణ జరగనుంది. తాజా పరిణామం ఐటీ రంగంలోని ఉద్యోగుల హక్కులపై చర్చను తిరిగి ప్రారంభించింది. ఈ సందర్భంగా.. ఇలాంటి సమస్యల్ని ఎదుర్కొంటున్న ఉద్యోగులు అంతా ముందుకు వచ్చి తమ హక్కుల గురించి పోరాడాలని నైట్స్ ప్రోత్సహిస్తోంది.ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జులై సెప్టెంబర్ త్రైమాసికంలో దేశంలోని 6 అతిపెద్ద ఐటీ కంపెనీలు అన్నీ కలిపి కేవలం 952 మంది ఉద్యోగుల్ని మాత్రమే చేర్చుకున్నట్లు ఎకనామిక్ టైమ్స్ నివేదించింది. ఇది అంతకుముందు త్రైమాసికంతో పోలిస్తే 77 శాతం తగ్గింది. ఇక్కడ ప్రధానంగా టీసీఎస్‌లోనే ఉద్యోగుల సంఖ్య తగ్గింది. మిగతా 5 కంపెనీలన్నీ కలిపి 20 వేల మందికిపైగా నియమించుకున్నాయి. ఇదే సమయంలో సైలెంట్ లేఆఫ్స్ అనే మరో అంశం తెరపైకి వచ్చింది. దీని కారణంగా.. ఈ సంవత్సరం సుమారు 50 వేల మందికిపైగా ఉద్యోగాలు కోల్పోతారని నిపుణులు అంచనా వేస్తున్నారు. చాలా వరకు పెద్ద, మధ్య స్థాయి టెక్ కంపెనీలు ఉద్యోగుల్ని.. సైలెంట్‌గా రాజీనామాలు చేయాలని.. ఇతర చోట్ల ఉద్యోగాలు చూసుకోవాలని బలవంతం చేస్తున్నట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. 202324 మధ్య ఇలాంటి కారణాలతో.. 25 వేల మందికి పైగా ఉద్యోగాలు కోల్పోయారని తెలిసింది. ఇది 2025లో రెట్టింపు అవుతుందని భావిస్తున్నారు.




## ఐబొమ్మ రవిని అరెస్ట్ చేయడం సంతోషం.. పోలీసులపై సినీ ప్రముఖుల ప్రశంసలు

టాలీవుడ్ ను షేక్ చేసిన ఐబొమ్మ సైట్ యజమాని రవిని పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. సినిమాలను పైరసీ చేసి తన సైట్ లో అప్లోడ్ చేయడంతో ఇమ్మడి రవిపై నాలుగు కేసులు నమోదు అయ్యాయి.. అతని హార్డ్ డిస్క్‌లో 21 వేల సినిమాలున్నాయి.. ఆయన దగ్గర 50 లక్షల మంది డేటా ఉంది. 20 కోట్లు సంపాదించాడు.. అందులోనే రవి నుంచి 3 కోట్లు స్వాధీనం చేసుకున్నామని.. పోలీసులు తెలిపారు. తాజాగా సోమవారం సినీ ప్రముఖులు చిరంజీవి, నాగార్జున, రాజమౌళి, దిల్ రాజు తో కలిసి ప్రెస్‌మీట్ నిర్వహించిన సీపీ సజ్జనార్ పలు కీలక వ్యాఖ్యలు చేశారు. అలాగే ఐబొమ్మ రవి అరెస్ట్ అవ్వడం పై సినీ పరిశ్రమ రియాక్ట్ అయ్యింది.ఐబొమ్మ రవిని అరెస్ట్ చేయడం సంతోషం కలిగించిందని మెగాస్టార్ చిరంజీవి అన్నారు. అలాగే ఆయన మాట్లాడుతూ.. ఇందులో భాగస్వాములైన పోలీసులకు ధన్యవాదాలు. పెద్ద సినిమాలతో తెలుగుఖ్యాతి ఖండాంతరాలకు వెళ్తోంది. పైరసీ అనేది సినీ పరిశ్రమకు ఛాలెంజింగ్‌గా మారింది. సినిమాను నమ్ముకొని వేల కుటుంబాలు జీవిస్తున్నాయి. పైరసీపై యుద్ధం జరుగుతూనే ఉండాలి అని చిరంజీవి అన్నారు. అలాగే రాజమౌళి మాట్లాడుతూ.. ఐబొమ్మ రవి అరెస్ట్ ఒక సినిమా సీన్‌లా ఉందన్నారు. రవి అరెస్ట్‌లో పోలీసుల చొరవకు ధన్యవాదాలు తెలిపారురాజమౌళి.అదేవిధంగా హైదరాబాద్ పోలీసులకు ధన్యవాదాలు తెలిపారు నిర్మాత దిల్ రాజు. పైరసీపై కేంద్రం కూడా చట్టాలు తీసుకురాబోతోంది. పైరసీ సినిమాలు చూడొద్దని ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నా..కొత్తసినిమాలు 4 వారాల్లో OTTలోకి వస్తాయి అని దిల్‌రాజు తెలిపారు. అదేవిధంగా నాగార్జున మాట్లాడుతూ..సంచలన వ్యాఖ్యలు చేశారు. మా కుటుంబంలో ఒకరు డిజిటల్ అరెస్ట్‌కు గురయ్యారు. పోలీసులను ఆశ్రయిస్తే సమస్య పరిష్కరించారు. కానీ వాళ్లను ట్రేస్ చేయలేకపోయాం అని నాగార్జున చెప్పుకొచ్చారు.



## 'నాకు రాముడంటే ఇష్టం లేదు'.. రాజమౌళి పాత ట్వీట్ వైరల్, మళ్లీ ట్రోలింగ్ షురూ!

తెలుగు సినీ పరిశ్రమని గ్లోబల్ లెవల్‌కి తీసుకెళ్లి ఆస్కార్ అవార్డు సైతం అందుకున్నాడు దర్శక ధీరుడు ఎస్ ఎస్ రాజమౌళి . తన సినిమాలేవో తాను తీసుకుంటూ వివాదాలకు దూరంగా ఉంటాడు జక్కన్న. అందుకే సినీ ఇండస్ట్రీలో అందరూ ఆయన్ని అభిమానిస్తారు. ఇతర విషయాలేవీ పట్టించుకోకుండా తన సినిమాలపై మాత్రమే దృష్టి పెట్టి ఎప్పుడూ కూల్‌గా, ప్రశాంతంగా కనిపిస్తారు. కానీ మహేష్ బాబు - రాజమౌళి కాంబినేషన్‌లో రూపొందుతున్న "వారణాసి" సినిమా గ్లోబ్ ట్రూటర్ ఈవెంట్‌లో ఆయన చేసిన ఒక వ్యాఖ్య మాత్రం పెద్ద వివాదాన్ని రేపింది.ఈ ఈవెంట్‌లో మాట్లాడుతూ, "నాకు దేవుడు అంటే నమ్మకం లేదు", "సినిమాను హనుమంతుడు చూసుకుంటాడని నాన్న చెప్పినప్పుడు నాకు కోపం వచ్చింది. ఇదేనా చూసుకోవడం అంటే" అని రాజమౌళి చెప్పిన మాటలు సోషల్ మీడియాలో హీట్ పెంచేశాయి. ఈ వ్యాఖ్యలను కొందరు తన వ్యక్తిగత విశ్వాసం అని భావించినప్పటికీ, మరికొందరు మాత్రం అతడిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ విపరీతంగా ట్రోలింగ్‌కి పాల్పడుతున్నారు. ఓ నాస్తికుడిగా ఫీలవ్వడం నీ వ్యక్తిగతం...కానీ హిందూ దేవతలపై కామెంట్ చేయడం ఎందుకు అంటూ నెటిజన్లు ప్రశ్నిస్తున్నారు. ఇంకొంత మంది "నీ సినిమాలకు హిందూ పురాణాలే బేస్... ఇప్పుడు వాటినే విమర్శించే ధైర్యం ఎలా వచ్చింది?" అని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు .ఈ వివాదం ముగియకముందే రాజమౌళి మరో వివాదంలో చిక్కుకున్నారు. గతంలో ఆయన చేసిన ట్వీట్‌ని స్క్రీన్ షాట్ తీసి నెటిజన్లు విమర్శలు గుప్పిస్తున్నారు. 2011లో ఒక అభిమాని సోషల్ మీడియా వేదికగా రాజమౌళికి శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలుపగా రాజమౌళి ఇచ్చిన సమాధానం ఇప్పుడు మళ్లీ ట్రోలర్స్‌కి టార్గెట్‌గా మారింది. "థాంక్యూ... కానీ నాకు రాముడు అంటే ఎప్పుడూ ఇష్టం లేదు. అన్ని అవతారాల్లో కృష్ణుడే నాకు ఇష్టం." అని ఆయన సమాధానమిచ్చారు. అప్పుడు పెద్దగా చర్చకు రాని ఈ ట్వీట్ ఇప్పుడు మళ్లీ ఆన్‌లైన్‌లో చక్కర్లు కొడుతోంది. గ్లోబ్ ట్రోటర్ ఈవెంట్‌లో చేసిన వ్యాఖ్యలకు అనుసంధానించి ఈ పాత ట్వీట్‌ను నెటిజన్లు షేర్ చేస్తూ జక్కన్నపై విమర్శల దాడి పెంచుతున్నారు." రాముడిని ఇష్టపడని నువ్వు రామాయణం, మహాభారతం కథలపై సినిమాలు తీసి సంపాదించడం ఏంటి?" అంటూ నెటిజన్లు ప్రశ్నిస్తున్నారు. రాజమౌళి దేవతలపై వ్యక్తిగత అభిప్రాయాన్ని వ్యక్తపరచడం తప్పు కాదని కొందరు భావిస్తున్నా, నెటిజన్లలో ఓ వర్గం మాత్రం వెనక్కి తగ్గడం లేదు. రాముడు ఇష్టం లేకపోతే రామాయణం మీద సినిమా చేయడానికి ఎందుకు ఆసక్తి, పురాణ కథలతో డబ్బు సంపాదిస్తావ్... కానీ దేవుడి గురించి కామెంట్ చేస్తావ్? ఇదేం డబుల్ స్టాండర్డ్?, నాస్తికుడైతే సర్దుకుపోతాం...కానీ పబ్లిక్‌గా దేవతల్ని దిగజార్చడం ఏంటి జక్కన్నా?... అంటూ సోషల్ మీడియాలో విమర్శలు గుప్పిస్తున్నారు. మరి ఈ విమర్శలపై రాజమౌళి ఎలా స్పందిస్తారో వేచి చూడాలి.



# శివ వైబ్స్ రీక్రియేట్ చేస్తున్న నాగార్జున..



అక్కినేని నాగార్జున నటించిన ఐకానిక్ మూవీ శివ ఇటీవలే గ్రాండ్‌గా రీరిలీజ్ అయిన విషయం తెలిసిందే. రీరిలీజ్‌లో సూపర్ రెస్పాన్స్ రాబట్టుకుంది శివ. ఇక మరోసారి శివ సినిమా నాటి వైబ్స్ క్రియేట్ చేస్తున్నాడు నాగార్జున. చైన్ బ్రాస్లెట్‌ను అరచేతిలో మడిచి పట్టుకున్న నాగార్జున బ్లాక్ డ్రెస్‌కు మ్యాచ్ అయ్యే గాగుల్స్‌తో స్టైలిష్‌గా రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్‌పై కూర్చొని కెమెరాకు ఫోజులిచ్చాడు.‘1989 నాటి కాలం నుండి 2025 వరకు... అతడి తేజస్సు సున్నితంగా గాలిలా ప్రయాణిస్తుంది... అయినప్పటికీ అతడి చరిష్మా శాశ్వతమైనది.. సొగసైనది..మరపురానిది..’ అనే క్యాప్షన్‌తో పోస్ట్ చేసిన తాజా స్టిల్స్ నెట్టింట వైరల్ అవుతున్నాయి. ఆరు పదుల వయస్సు దాటినా కుర్ర హీరోలకు ఏ మాత్రం తగ్గేదే లే అంటూ తాజా స్టిల్స్‌తో చెప్పకనే చెప్పేస్తున్నాడు నాగార్జున.ఈ ఏడాది కుబేర, కూలీ సినిమాలతో సూపర్ హిట్స్ అందుకున్నాడు టాలీవుడ్ యాక్టర్ అక్కినేని నాగార్జున. నాగార్జున ప్రస్తుతం కెరీర్‌లో ల్యాండ్ మార్క్ సినిమాగా నిలిచిపోయే 100వ ప్రాజెక్ట్‌పై వర్క్ చేస్తున్నాడు. ఈ చిత్రాన్ని తమిళ దర్శకుడు రా కార్తీక్ డైరెక్ట్ చేస్తున్నాడు. ఈ మూవీని నాగార్జున 2026 మే నెలలో సమ్మర్ కానుకగా అభిమానుల ముందుకు తీసుకురావాలని ప్లాన్ చేస్తున్నట్టు ఇప్పటికే వార్తలు రాగా.. నాగార్జున టీం నుంచి క్లారిటీ రావాల్సి ఉంది.

# బాలయ్య వివాదానికి ఫుల్‌స్టాప్!





హైదరాబాద్ మాజీ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ చేసిన ఒక చిన్న ఎమోజీ పోస్ట్ సోషల్ మీడియాలో ఫ్యాన్ వార్‌కు కారణమైంది. దాదాపు నెలన్నర పాటు సాగిన ఈ వివాదంపై ఆయన ఎట్టకేలకు స్పందించారు. హిందూపురం ఎమ్మెల్యే, నటుడు నందమూరి బాలకృష్ణకు క్షమాపణలు చెబుతూ, ఈ వ్యవహారాన్ని ఇక్కడితో ముగించాలని అభిమానులను కోరారు. బాలయ్య అభిమానులు కూడా ఆయన వివరణతో శాంతించారు. సీవీ ఆనంద్ తన తాజా పోస్టులో రెండు నెలల క్రితం జరిగిన ఘటనను గుర్తుచేస్తూ, ఒక ఎమోజీ కారణంగా బాలకృష్ణ అభిమానులు, ఆయన విమర్శకులు పరస్పరం సోషల్ మీడియాలో ఫ్యాన్ వార్‌కు దిగారని, ఆ గొడవలో భాగంగా తనను కూడా లక్ష్యంగా చేసుకున్నారని తెలిపారు.నగరానికి సంబంధించిన సంఘటనలు, కేసుల వలన వెంటనే స్పందించలేకపోయానని చెప్పారు. సెప్టెంబర్ 29న జరిగిన ఒక ప్రెస్ మీట్ అనంతరం, బాలయ్యకు సంబంధించి ఓ నెటిజన్ అడిగిన ప్రశ్నకు బదులుగా ఎమోజీ పెట్టడం పూర్తిగా అనవసర నిర్ణయమని ఆయన అంగీకరించారు. ఆ పోస్ట్ వివాదానికి దారి తీసిందని తెలుసుకున్న వెంటనే దానిని తొలగించానని, వివరాలు తెలుసుకున్న తర్వాత బాలకృష్ణకు స్వయంగా మెసేజ్ పంపి క్షమాపణలు చెప్పానని వెల్లడించారు. బాలయ్యతో పాటు చిరంజీవి, వెంకటేష్, నాగార్జున సినిమాలు చూస్తూ పెరిగానని, వారందరితో తనకు మంచి స్నేహం, గౌరవం ఉన్నట్లు చెప్పారు.సీవీ ఆనంద్ మాట్లాడుతూ, తాను పెట్టిన ఎమోజీ పోస్ట్‌తో పాటు మరో కొన్ని తప్పుడు పోస్టులను చేసిన సోషల్ మీడియా హ్యాండ్లర్‌ను ఇప్పటికే తొలగించానని, అందుకే గత నెలలో తన అకౌంట్లలో చాలా తక్కువ పోస్టులు కనబడుతున్నాయని చెప్పారు. సమయం లేకపోవడం వల్ల ప్రతిదానికి వెంటనే స్పందించలేకపోతున్నానని తెలిపారు. దయచేసి ఈ వివాదాన్ని ఇక్కడితో ముగించాలని అభిమానులను అభ్యర్థించారు. అసలు వివాదం ఎలా మొదలైందంటే దాదాపు నెలన్నర క్రితం సీవీ ఆనంద్ సినీ ప్రముఖులతో మూవీ పైరసీ, డిజిటల్ లీకేజీ, బెట్టింగ్ యాప్‌ల పైనా జరిగిన ఒక కీలక మీటింగ్ గురించి పోస్ట్ చేశారు. ఆ మీటింగ్‌కు చిరంజీవి, వెంకటేష్, నాగార్జున, నాని, నాగచైతన్య, దిల్ రాజు తదితరులు హాజరయ్యారు. దీనిని చూసిన ఒక బాలయ్య అభిమాని “మా బాలకృష్ణను మీటింగ్‌కు ఎందుకు పిలవలేదు? ఈ విషయాన్ని అసెంబ్లీలో లేవనెత్తుతారు” అని కామెంట్ చేశాడు. దానికి సీవీ ఆనంద్ నవ్వుతున్న ఎమోజీతో స్పందించడం బాలయ్య అభిమానులను ఆగ్రహానికి గురిచేసింది. దీంతో సోషల్ మీడియాలో ఫ్యాన్ వార్ రాజుకుంది. ఈ వివాదంపై ఇప్పుడు క్షమాపణ చెబుతూ, ఇరువర్గాలు శాంతించాలని కోరడంతో ఈ వ్యవహారం పూర్తిగా ముగిసినట్లైంది.

# ఘట్టమనేని వారసుడి ఎంట్రీ..






ఘట్టమనేని కుటుంబం నుంచి మూడో తరం హీరో ఎంట్రీకి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. సూపర్ స్టార్ మహేష్ బాబు సోదరుడు రమేష్ బాబు తనయుడు జయకృష్ణ ఘట్టమనేని హీరోగా పరిచయం అవుతున్న విషయం తెలిసిందే. ‘ఆర్ఎక్స్ 100’, ‘మంగళవారం’ వంటి సినిమాలకు దర్శకత్వం వహించిన అజయ్ భూపతి ఈ చిత్రాన్ని డైరెక్ట్ చేస్తున్నారు. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు వేగంగా జరుగుతుండగా, సినిమా నుంచి మరో ఆసక్తికర అప్డేట్ బయటకు వచ్చింది .ఈ చిత్రంలో హీరోయిన్‌గా బాలీవుడ్ స్టార్ హీరోయిన్ రవీనా టాండన్ కుమార్తె రషా తడానీ అధికారికంగా కన్ఫర్మ్ అయ్యింది. ఇది ఆమెకు తొలి తెలుగు చిత్రం. ఈ సందర్భంగా టీం ప్రత్యేక పోస్టర్ విడుదల చేస్తూ రషాకు గ్రాండ్ వెల్‌కమ్ చెప్పింది. కొద్ది రోజులుగా ఆమె నటిస్తుందంటూ ప్రచారం జరుగుతుండగా, సోమవారం విడుదలైన పోస్టర్‌తో దీనికి అధికారిక క్లారిటీ వచ్చింది. ‘AB4’ పేరుతో ప్రచారం జరుగుతున్న ఈ ప్రాజెక్ట్ నవంబర్ నెలలోనే రెగ్యులర్ షూటింగ్‌కు వెళ్లనుంది. బాలీవుడ్‌లో రషా అరంగేట్రం చేసియగా, అప్పుడు ‘ఆజాద్’ సినిమాలో ఒకే ఒక్క స్పెషల్ సాంగ్‌తోనే ఆమె ఓవర్‌నైట్ స్టార్ అయింది. ఎనర్జిటిక్ డ్యాన్స్ మూవ్‌మెంట్‌లు, స్క్రీన్ ప్రెజెన్స్ అందరినీ ఆకట్టుకున్నాయి. ఇప్పుడు అదే జోష్‌తో తెలుగు ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతోంది.జయకృష్ణ ఘట్టమనేనిని న్యూ ఏజ్ లవ్ స్టోరీతో ఇండస్ట్రీకి పరిచయం చేస్తున్నారు. తిరుపతి – చిత్తూరు నేపథ్యంతో ఈ చిత్రం తెరకెక్కనున్నట్లు తెలుస్తోంది. ఇటీవల రిలీజ్ చేసిన కాన్సెప్ట్ పోస్టర్ కూడా ఈ విషయాన్నే స్పష్టం చేసింది. ఈ చిత్రం తెలుగు సినిమాల్లో కొత్త ట్రెండ్‌ను సెట్ చేసేలా ఉంటుందని సినీ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. టాలీవుడ్ టాప్ ప్రొడ్యూసర్ అశ్వినీదత్ ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నారు. ‘రాజకుమారుడు’తో మహేష్ బాబును హీరోగా పరిచయం చేసిన అశ్వినీదత్, ఇప్పుడు ఘట్టమనేని ఫ్యామిలీ నుంచి మూడో తరం హీరోను కూడా పరిచయం చేయడం విశేషం. చందమామ కథలు బ్యానర్‌పై పి. కిరణ్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు .ఈ చిత్రానికి “శ్రీనివాస మంగాపురం” అనే టైటిల్‌ను పరిశీలిస్తున్నట్లు సమాచారం. త్వరలోనే దీనిపై అధికారిక ప్రకటన రానుందని మూవీ వర్గాలు చెబుతున్నాయి.

# శివాజీ ‘దండోరా’ టీజర్




శివాజీ, నవదీప్, నందు, రవికృష్ణ, మనికా చిక్కాల, మౌనికా రెడ్డి, బిందు మాధవి, రాధ్య, అదితి భావరాజు ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం ‘దండోరా’. మురళీకాంత్ ఈ సినిమాకి దర్శకత్వం వహిస్తున్నారు. ‘కలర్ ఫోటో’, ‘బెదురులంక 2012’ చిత్రాల నిర్మాత రవీంద్ర బెనర్జీ ముప్పానేని ఈ చిత్రాన్ని లౌక్య ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్ పై నిర్మిస్తున్నారు. క్రిస్మస్ సందర్భంగా థియేటర్లలో విడుదల చేయడానికి ప్లాన్ చేస్తున్నారు. ప్రమోషన్స్ లో భాగంగా సోమవారం ఈ మూవీ టీజర్‌ను చిత్ర యూనిట్ రిలీజ్ చేసింది.‘దండోరా’ టీజర్‌లోకి వెళ్తే, ప్రేయసితో ప్రేమికుడు మాట్లాడుతూ ఆమెను ముద్దు పెట్టుకుంటానని అంటాడు. ‘ఏం చేద్దామనుకుంటున్నావ్.. పిచ్చిపిచ్చిగా ఉందా’ అంటూ ఆ అమ్మాయి రివర్స్ అయ్యే సీన్ కామెడీగా ఉంటుంది. అలా మొదలైన టీజర్‌లో నెక్ట్స్ రెండు పాత్రలను పరిచయం చేశాడు. సర్పంచ్ పాత్రలో నవదీప్ నటించాడు. కూలింగ్ గ్లాసెస్ వేసుకుని అందరూ నమస్కారం పెడుతుంటే తను కూడా వారికి విష్ చేస్తూ దర్పంగా ఉండే పాత్రలో నవదీప్ కనిపించాడు. మరో పాత్రను పరిచయం చేశారు.. అందులో నటుడు శివాజీ కనిపించారు. ‘హైదరాబాద్ పో..అమెరికా పో.. యాడికైనా బో.. చస్తే ఇడీకే తేవాలె’ అని చెబుతుంటాడు.'మేం తంతే లేవనోళ్లు.. అయినొచ్చి గొకితే లేస్తరని ఎందివయా ఇది' అని వెటకారంగా నవదీప్ చెప్పే డైలాగ్.. పల్లెటూర్లు కొన్ని సీన్స్ కామెడీ టచ్‌తో సాగేలా ఉన్నాయి. మరో కొత్త పాత్ర ఎంట్రీ.. నందు. భార్య కూతుర్ని తిడుతుంటాడు. అలాగే బిందు మాధవి.. వేశ్య పాత్రలో కనిపించింది. ‘ఎవరు చెప్పారు నేను తప్పు చేస్తున్నానని.. వాళ్లు డబ్బులిస్తున్నారు..నేను వాళ్లకి సర్వీస్ చేస్తున్నానంటూ’ ఆమె శివాజీతో చెప్పిన డైలాగ్..సీన్స్‌తో పాత్రలను పరిచయం చేసిన దర్శకుడు నెక్ట్స్ సీన్‌లో ఓ ఎమోషనల్ కోణాన్ని ఆవిష్కరించాడు. శవాన్ని మోస్తూ తీసుకెళుతుంటారు. అక్కడ ఓ పిల్లాడు అన్నా.. మా అవ్వను ఇంత దూరం ఎందుకు తీసుకెళుతున్నారని ప్రశ్నిస్తాడు. ‘నాలుగు పుస్తకాలు చదివి..లోకమంతా తెలిసినట్లు మాట్లాడొద్దు.. నీకు తెలియని లోకం ఇంకోటుందిరా’ అంటూ శివాజీ చెప్పే డైలాగ్ చూస్తుంటే సినిమాలో మరేదో ఇంట్రెస్టింగ్ ఎలిమెంట్ ఉందని తెలుస్తోంది. పుట్టుకు..చావు మధ్య మనిషి ఎదుర్కొనే సంఘర్షణ, పరిస్థితులు, భావోద్వేగాలు గురించి చెప్పే కథాంశంతో ‘దండోరా’ రూపొందుతోందని స్పష్టమవుతోంది. దండోరా సినిమా సామాజిక స్పృహను కలిగించే అంశంతో తెరకెక్కుతోంది. అగ్ర వర్ణాలకు చెందిన అమ్మాయిల ప్రేమించి పెళ్లి చేసుకున్నా, అగ్ర వర్ణాలకు ఎదురు తిరిగినా ఎలాంటి దౌర్జన్యకాండ జరుగుతున్నాయనే అంశాన్ని ఆధారంగా చేసుకుని దండోరా సినిమాను తెరకెక్కిస్తున్నారు. తెలంగాణ గ్రామీణ నేపథ్యంలో మన పురాతన ఆచారాలు, సాంప్రదాయాలను ఆవిష్కరిస్తూనే వ్యంగ్యం, చక్కటి హాస్యం, హృదయాన్ని హత్తుకునే భావోద్వేగాల కలయికగా ఈ సినిమాను ఆవిష్కరిస్తున్నారు. టీజర్‌తో దర్శకుడు బలమైన అంశాన్ని చెప్పాలనకుంటున్నాడనే విషయం తెలుస్తుంది. సినిమాపై అంచనాలు మరింతగా పెరిగాయి. ఈ సినిమా డిసెంబర్ 25న గ్రాండ్ రిలీజ్ చేస్తున్నారు.

# సాయి ధరమ్ తేజ్ పెళ్లి ఫిక్స్!




టాలీవుడ్ యంగ్ హీరో సాయి ధరమ్ తేజ్ తన వివాహంపై ఎంతోకాలంగా సాగుతున్న ఊహాగానాలకు స్వయంగా ముగింపు పలికారు. ఈ ఉదయం తిరుమల శ్రీవారి దర్శనం తర్వాత మీడియాతో మాట్లాడిన ఆయన, వచ్చే ఏడాదిలో తన పెళ్లి జరగబోతోందని అధికారికంగా ప్రకటించారు. ఈ వార్తతో ఆయన అభిమానులు, కుటుంబ సభ్యులు ఆనందంలో మునిగిపోయారు. శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆశీర్వాదంతో నాకు మంచి సినిమాలు, మంచి జీవితం దక్కాయి. వచ్చే ఏడాదిలోనే నా వివాహం జరుగుతుంది.కొత్త సంవత్సరం దృష్ట్యా, స్వామివారి ఆశీస్సులతో ముందుకు సాగాలని తిరుమల వచ్చినట్లు తెలిపారు. చాలా రోజులుగా సోషల్ మీడియాలో, ఫ్యాన్ సర్కిల్స్‌లో వినిపిస్తున్న పెళ్లి వార్తలకు ఆయన మాటలతో ఫుల్ క్లారిటీ వచ్చేసింది. ఇక సాయి ధరమ్ తేజ్ తన పెళ్లి విషయంతో పాటు తన కొత్త సినిమా ‘సంబరాల ఏటి గట్టు’ గురించి కూడా ప్రస్తావించారు. రోహిత్ కేపీ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ పాన్‌ఇండియా యాక్షన్ ఎంటర్‌టైనర్ చిత్రం ప్రైమ్ షో ఎంటర్‌టైన్మెంట్స్ నిర్మాణంలో రూపొందుతుంది. భారీ బడ్జెట్‌తో, భారీ అంచనాలతో రూపొందుతున్న చిత్రం నుండి ఇప్పటికే రిలీజ్ అయిన గ్లింప్స్‌కు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వచ్చింది .“అసుర సంధ్యవేళ మొదలైంది... రాక్షసుల ఆగమనం” అనే పవర్‌ఫుల్ డైలాగ్ సినిమాపై హైప్‌ను మరింత పెంచింది. ఈ సినిమాతో సాయి తేజ్ మరో మంచి హిట్ దక్కించుకోవడం ఖాయం అంటున్నారు. మరోవైపు సాయి తేజ్ చేసిన పెళ్లి ప్రకటనతో సోషల్ మీడియా శుభాకాంక్షలతో నిండిపోయింది. చివరకు మా హీరో పెళ్లి ఫిక్స్.. సంబరాల ఏటి గట్టు రియల్ లైఫ్ సాంబరాలు కూడా మొదలయ్యాయి అంటూ ఫ్యాన్స్ కామెంట్స్ చేస్తున్నారు. మొత్తంగా కొత్త సినిమా, కొత్త ఆరంభం, కొత్త జీవితం అన్నీ కలిసి సాయి తేజ్ జీవితంలో కొత్త దశకు శ్రీకారం చుట్టనున్నాయి. వచ్చే ఏడాది పెళ్లి వివరాలు, వధువు గురించి సమాచారం ఇచ్చే అవకాశం ఉంది.

## కమిన్స్ ఫిట్.. యాషెస్ తొలి టెస్టులో ఆడేనా..!



యాషెస్ సిరీస్ ఆరంభానికి ముందే గాయాలతో సతమతమవుతున్న ఆస్ట్రేలియాకు గుడ్‌న్యూస్. గాయం నుంచి కోలుకున్న కెప్టెన్ ప్యాట్ కమిన్స్ ఫిట్‌నెస్ సాధించాడు. పెర్త్ టెస్టు కు అందుబాటులో ఉండడని చెప్పిన ప్యాటీ సోమవారం నెట్స్‌లో చెమటోడ్చాడు. సహచరులతో కలిసి ఉత్సాహంగా బౌలింగ్ కూడా చేశాడు. దాంతో.. తొలి మ్యాచ్‌లో అతడు ఆడడం ఖాయమనిపిస్తోంది. ప్రధాన పేసర్ హేజిల్‌వుడ్ గాయంతో సిరీస్ ఓపెనర్‌కు దూరమైనందున అనుభవజ్ఞుడైన కమిన్స్ ఆడేందుకు సిద్ధమవుతున్నాడని సమాచారం.సొంతగడ్డపై యాషెస్ సిరీస్ ప్రారంభానికి మరో నాలుగు రోజులే ఉంది. రికార్డులు ఘనంగానే ఉన్నా ఆస్ట్రేలియాను గాయాలు వెంటాడుతున్నాయి. కమిన్స్ కోలుకున్నా.. పేసర్లు హేజిల్‌వుడ్, సీన్ అబాట్, రిచర్డ్‌సన్ గాయంతో అందుబాటులో లేరు. ఇక కుర్రాళ్లనే నమ్ముకోకతప్పని పరిస్థితి. అయితే.. ఇంగ్లండ్‌ను నిలువరించాలంటే బలమైన పేస్ దళం అవసరమైన వేళ కమిన్స్ జట్టుకోసం ‘నేనున్నా’ని అంటున్నాడు. పెర్త్ టెస్టు నవంబర్ 21న జరుగనున్నందున.. బౌలింగ్ ప్రాక్టీస్ చేస్తూ ఆసీస్ శిబిరంలో ఉత్సాహం నింపాడీ సారథి. మునపటిలా అతడు బౌలింగ్ చేయడంతో తొలి మ్యాచ్‌కు తాను సిద్ధమేనని ప్యాటీ చెప్పేశాడని కంగారూ క్రికెటర్లు అనుకుంటున్నారు. ఒకవేళ కమిన్స్ తుది జట్టులో ఉంటే స్టీవ్ స్మిత్ బదులు అతడే సారథ్య వహించడం పక్కా. హేజిల్‌వుడ్ స్థానంలో ఆల్‌రౌండర్ మైఖేల్ నెసర్ ను స్క్వాడ్‌లోకి తీసుకున్నారు క్రికెట్ ఆస్ట్రేలియా సెలెక్టర్లు.

## రూ. 20 కోట్ల ప్లేయర్‌పై కన్నేసిన కావ్యపాప..



అనుకున్నట్టుగానే జరిగింది. ఐపీఎల్ ఫ్రాంచైజీలన్నీ కూడా తమ కోర్ టీంపై నమ్మకాన్ని ఉంచాయి. ముఖ్యంగా బెంచ్‌కే పరిమితమైన ప్లేయర్స్, నిలకడలేమి ఆటగాళ్లకు గుడ్ బై చెప్పేసి తమ పర్స్‌లను ఖాళీ చేశాయి. ఇక సన్‌రైజర్స్ హైదరాబాద్ విషయానికొస్తే.. ట్రావిస్ హెడ్‌ను ముంబై టీంకు ట్రేడ్ చేసి.. రోహిత్ శర్మను తీసుకుంటుందని.. అలాగే హెన్రిచ్ క్లాసెన్‌ను వేలంలోకి వదిలేసి.. మళ్లీ కొనుగోలు చేస్తుందని టాక్ వినిపించింది. అయితే అవన్నింటిని పటాపంచలు చేస్తూ కావ్యపాప.. తన కోర్ టీంపై మళ్లీ భరోసాతో ముందుకు వెళ్తోంది.

రాహుల్ చాహర్, సిమర్జీత్ సింగ్, అభినవ్ మనోహర్, సచిన్ బేబీ, అథర్వ తైదే, వియాన్ ముల్డర్, మహ్మద్ షమీ(LSGకి ట్రేడ్) ఇక కోర్ టీం విషయానికొస్తే.. ట్రావిస్ హెడ్, అభిషేక్ శర్మ కచ్చితంగా మరోసారి ఓపెనింగ్ బ్యాటర్లుగా బరిలోకి దిగనున్నారు. అలాగే మిడిలార్డర్‌లో ఇషాన్ కిషన్, హెన్రిచ్ క్లాసెన్ ఉండకనే ఉన్నారు.. ఆ తర్వాత నితీష్ కుమార్ రెడ్డి, అనికేట్ వెర్మ దిగనుండగా.. వీరికంటే ముందు మరో ఆల్‌రౌండర్ కమ్ ఫినిషర్ రోల్ కోసం ఓ ప్లేయర్‌ను వేలంలో కొనుగోలు చేయాలని హైదరాబాద్ యాజమాన్యం చూస్తోంది. కెప్టెన్ ప్యాట్ కమిన్స్ కూడా అతడి కోసం కోట్లు అయినా ఖర్చు చేయాలని చెప్పాడట. మరి అతడెవరో కాదు.. కామెరాన్ గ్రీన్.గాయం నుంచి కోలుకున్న ఈ ఆస్ట్రేలియా ఆల్‌రౌండర్.. అటు వన్డేలు, ఇటు టీ20ల్లో దుమ్ము లేపుతున్నాడు. అలాగే మరికొన్ని రోజుల్లో యాషెస్ టెస్ట్ సిరీస్ ప్రారంభం అవుతుండటంతో.. అందరి ఫోకస్ అతడిపైనే పడింది. అయితే ఇక్కడ హైదరాబాద్‌కు గ్రీన్ కోసం మినీ వేలంలో గట్టి పోటీ అయ్యేలా కనిపిస్తోంది. అటు కేకేఆర్, చెన్నై కూడా ఈ ఆల్‌రౌండర్ కోసం పోటీపడుతున్నాయి. మరి చూడాలి ఎవరికి దక్కుతాడో.?

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లిపాక రాజేష్
తెలుగు దిన పత్రిక





# డాక్టర్ల కోసం ప్రత్యేక క్రికెట్ టోర్నీ ప్రారంభం

- పీయూష్ గోయల్, న్యూజిలాండ్ మంత్రి టాడ్ మెక్‌క్లే కలిసి ప్రారంభోత్సవం
- ఖస్దార్ క్రీడా మహోత్సవంలో ప్రత్యేక కార్యక్రమం
- గిరిజన నృత్యాలు, సంప్రదాయ క్రీడల ప్రదర్శన ఆకట్టింది
- భారత్–న్యూజిలాండ్ స్నేహానికి కొత్త ఊపు

ఉత్తర ముంబయిలో నిర్వహిస్తున్న ఖస్దార్ క్రీడా మహోత్సవంలో భాగంగా డాక్టర్ల కోసం ప్రత్యేక క్రికెట్ టోర్నమెంట్‌ను కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి న్యూజిలాండ్ వాణిజ్య, పెట్టుబడులు, వ్యవసాయం & అటవీ శాఖల మంత్రి టాడ్ మెక్‌క్లే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఇద్దరు కలిసి టోర్నమెంట్‌ను ప్రారంభించి పాల్గొనే జట్లను అభినందించారు. మహోత్సవంలో భాగంగా నిర్వహించిన గిరిజన నృత్యాల ప్రదర్శన, మల్లఖంబ్ వంటి సంప్రదాయ క్రీడలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. భారతీయ సంస్కృతి వైభవాన్ని ప్రతిబింబించే ఈ ప్రదర్శనలు వేదిక అంతా ఉత్సాహంతో నింపాయి. స్థానిక కళాకారులు, యువ క్రీడాకారులు తమ ప్రతిభను ప్రదర్శించారు. స్పోర్ట్స్ స్పిరిట్, సాంస్కృతిక గౌరవం, అంతర్జాతీయ స్నేహబంధాలను బలపరచే ఈ కార్యక్రమం చిరస్మరణీయమైందని పీయూష్ గోయల్ వ్యాఖ్యానించారు. భారత్-న్యూజిలాండ్ మధ్య వాణిజ్య, క్రీడా, సాంస్కృతిక రంగాల్లో భాగస్వామ్యం మరింత బలపడుతోందని ఆయన తెలిపారు. టాడ్ మెక్‌క్లే కూడా భారతీయ అతిథ్యసత్కారాన్ని ప్రశంసిస్తూ, ఈ కార్యక్రమం రెండు దేశాల స్నేహానికి కొత్త మైలురాయిగా నిలుస్తుందని అన్నారు. క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొంటున్న డాక్టర్లు, ఆరోగ్య సిబ్బంది తమ సేవలతో పాటు క్రీడల్లోనూ చురుకుగా పాల్గొంటున్నందుకు పలువురు నాయకులు అభినందనలు తెలిపారు.



## ఆషియన్ ఆర్చరీ చాంపియన్‌షిప్స్‌లో భారత తూటాలు మెరిశాయి

- పదికైరబాల్స్‌తో చారిత్రాత్మక విజయాన్ని అభినందించిన ప్రధాని మోదీ
- 6 స్వర్ణాలు సహా మొత్తం 10 పతకాలు
- 18 ఏళ్ల తర్వాత రికర్వ్ మెన్స్‌లో స్వర్ణ పతకం
- భారత యువ ఆటగాళ్లకు ప్రేరణగా నిలిచిన ఘనత

ఆషియన్ ఆర్చరీ చాంపియన్‌షిప్స్ 2025లో భారత అర్చరీ జట్టు చారిత్రాత్మక విజయాన్ని సాధించింది. మొత్తం 10 పతకాలు, అందులో 6 స్వర్ణాలు సాధించడం దేశ క్రీడా రంగానికి పెద్ద గర్వకారణంగా నిలిచింది. ముఖ్యంగా 18 ఏళ్ల తర్వాత రికర్వ్ మెన్స్ విభాగంలో వచ్చిన స్వర్ణ పతకం ఈ విజయానికి ప్రత్యేక మెరుపు జోడించింది. ఈ అద్భుత ప్రదర్శనపై ప్రధాని నరేంద్ర మోదీ జట్టు సభ్యులను అభినందించారు. తమ అత్యుత్తమ ప్రతిభతో దేశానికి కీర్తి తీసుకువచ్చిన అర్చర్లను ప్రశంసిస్తూ, ఈ విజయం భవిష్యత్తు తరాల యువ అథ్లెట్లను ప్రేరేపిస్తుందని ఆయన పేర్కొన్నారు. వ్యక్తిగత విభాగాల్లో కూడా భారత ఆటగాళ్లు బలమైన ప్రదర్శనలు కనబర్చడం, కంపౌండ్ ఈవెంట్‌లో టైటిల్ డిఫెన్స్ సాధించడం ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. టోర్నమెంట్ మొత్తం భారత అర్చరీ విభాగం అపూర్వమైన జట్టు సమన్వయం, నైపుణ్యం ప్రదర్శించగా, అంతర్జాతీయ వేదికపై దేశ ప్రతిష్ఠను మరింత పెంచింది. క్రీడాభిమానులు, కోచ్‌లు, ఫెడరేషన్ అధికారులు ఈ విజయం భవిష్యత్తులో మరిన్ని గ్లోబల్ మెడల్స్‌కు మార్గం సుగమం చేస్తుందని భావిస్తున్నారు.

## మరణశిక్షపై మొదటిసారి స్పందించిన షేక్ హసీనా : ఇది రాజకీయ కుట్ర

- అవామీ లీగ్‌ను బలహీనపర్చే ప్రయత్నమని ఆరోపణ
- హేగ్ అంతర్జాతీయ క్రిమినల్ కోర్టులో విచారణకు సిద్ధమంటూ సవాల్
- తాత్కాలిక ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు



బంగ్లాదేశ్ మాజీ ప్రధానమంత్రి, అవామీ లీగ్ అధినేత్రి షేక్ హసీనాపై అంతర్జాతీయ నేరాల ట్రిబ్యునల్ విధించిన మరణశిక్షపై ఆమె తొలిసారిగా ఘాటుగా స్పందించారు. గతేడాది జూలైలో జరిగిన ఆందోళనల సందర్భంగా మానవతా వ్యతిరేక నేరాలకు పాల్పడ్డారనే ఆరోపణలపై ఈ తీర్పు వెలువడగా, హసీనా దీనిని పూర్తిగా పక్షపాతంతో కూడిన, రాజకీయ ప్రేరేపిత కుట్రగా అభివర్ణించారు. మహ్మద్ యూనస్ నేతృత్వంలోని తాత్కాలిక ప్రభుత్వం ఏర్పాటు చేసిన "రిగ్డ్ ట్రిబ్యునల్" ఈ తీర్పు ఇచ్చిందని హసీనా ఆరోపించారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నిక కాని ప్రభుత్వం, తనను మరియు అవామీ లీగ్‌ను రాజకీయంగా అంతం చేయాలనే ఉద్దేశంతోనే ఈ కుట్ర పన్నిందని ఆరోపిస్తూ, ఐఏఎన్ఎస్ వెల్లడించిన వివరాలను ఆమె ప్రస్తావించారు. యూనస్ పరిపాలనలో దేశ ప్రజా సేవలు దెబ్బతిన్నాయని, శాంతిభద్రతలు కుప్పకూలాయని ఆమె తీవ్రంగా విమర్శించారు. గత ఏడాది జరిగిన ఆందోళనల్లో ఇరువర్గాల మరణాలపై తాను విచారం వ్యక్తం చేస్తున్నానని, కానీ నిరసనకారులపై కాల్పులు జరపమని తాను లేదా తన పార్టీ నేతలు ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేదని హసీనా స్పష్టం చేశారు. తనపై మోపిన ఆరోపణలన్నీ తాను చట్టపరంగా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నానని, నిజాయతీగా నడిచే న్యాయస్థానంలో తాను నిర్దోషిగా బయటపడతానని ఆమె ధీమా వ్యక్తం చేశారు. ఈ కేసును హేగ్‌లోని అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు విచారించాలనే సవాల్‌ను హసీనా విసురుతూ, ఐసీసీ విచారణ జరిగితే తాత్కాలిక ప్రభుత్వమే మానవ హక్కుల ఉల్లంఘనలకు బాధ్యత వహించాల్సి వస్తుందని ఆమె ఆరోపించారు. అందుకే ఈ సవాల్‌ను ప్రభుత్వం స్వీకరించడానికి ముందుకు రావడం లేదని హసీనా విమర్శించారు. ఈ తీర్పుతో బంగ్లాదేశ్ రాజకీయాలు మరోసారి ఉద్రిక్తంగా మారాయి.

## ఉత్తర మండల మండలి 32వ సమావేశానికి అధ్యక్షత వహించిన అమిత్ షా

- 'బలమైన రాష్ట్రం – బలమైన దేశం' లక్ష్యంపై మోదీ విజన్‌కి అనుసరణ
- రాష్ట్రాల మధ్య విధాన సమన్వయానికి జోనల్ కౌన్సిల్స్ కీలకం
- మహిళలు, పిల్లలకు వేగవంతమైన న్యాయానికి ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు పెంచాలన్న సూచన



ఉత్తర మండల మండలి 32వ సమావేశానికి కేంద్ర హోంమంత్రి అమిత్ షా అధ్యక్షత వహించారు. 'శక్తివంతమైన రాష్ట్రాలు – శక్తివంతమైన దేశం' అనే ప్రధాని మోదీ విజన్ సాధనలో జోనల్ కౌన్సిల్స్ కీలక పాత్ర పోషిస్తున్నాయని ఆయన వ్యాఖ్యానించారు. పరస్పర సంభాషణ, సమన్వయం, సహకారం ద్వారా రాష్ట్రాల మధ్య విధానాలు ఒకే దారిలో నడుస్తున్నాయని తెలిపారు. ప్రాంతీయ అభివృద్ధి, జాతీయ పురోగతి, గ్లోబల్ లీడర్‌షిప్ దిశగా దేశం సాగేందుకు ఈ మండలి నిర్ణయాలు తోడ్పడుతున్నాయని అమిత్ షా అన్నారు. ముఖ్యంగా భద్రత, అభివృద్ధి, పరిపాలనా సమన్వయానికి జోనల్ కౌన్సిల్స్ వేదికగా మారాయని పేర్కొన్నారు. సమావేశంలో మహిళలు, పిల్లలపై నేరాల విచారణను వేగవంతం చేయాలన్న ఉద్దేశ్యంతో ఫాస్ట్‌ట్రాక్ స్పెషల్ కోర్టుల సంఖ్యను పెంచాలని అమిత్ షా సూచించారు. న్యాయ వ్యవస్థను ఇంకా సులభతరం చేయడానికి, బాధితులకు త్వరిత న్యాయం అందించేందుకు కేంద్రం కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు. ఉత్తర మండల మండలిలోని రాష్ట్రాలతో కలిసి సహకార భావనతో ముందుకు సాగుతూ మోదీ ప్రభుత్వం సమగ్ర అభివృద్ధి లక్ష్యాన్ని సాధిస్తోంది అని అమిత్ షా తెలిపారు.

## ఢిల్లీ పేలుడు దర్యాప్తులో సంచలనం

- నేపాల్ నుంచి ఫోన్లు, కాన్పూర్ నుంచి సిమ్‌కార్డులు
- కుట్రదారులు కొనుగోలు చేసిన 7 సెకండ్‌హ్యాండ్ ఫోన్లు బయటకు
- కాన్పూర్ అడ్రెస్‌తో తీసుకున్న 17 సిమ్ కార్డులు దర్యాప్తును మళ్లించిన దిశ
- వైట్ కాలర్ టెర్రర్ మాడ్యూల్‌పై దృష్టి : పలువురు వైద్యులపై విచారణ



ఢిల్లీ పేలుడు ఘటన దర్యాప్తు వేగం పెరుగుతోంది. ఈ దాడికి సంబంధించి కీలక ఆధారాలను అధికారులు వరుసగా బయటకు తీసుకొస్తున్నారు. విచారణలో భారీ సంచలనం కలిగించే వివరాలు వెలుగులోకి వస్తున్నాయి. పేలుళ్ల కుట్రదారులు నేపాల్‌లో కొనుగోలు చేసిన సెకండ్‌హ్యాండ్ ఫోన్లు మరియు కాన్పూర్‌లో పొందిన సిమ్ కార్డులు ఉపయోగించినట్లు దర్యాప్తు నిర్ధారించింది. పోలీసుల సమాచారం ప్రకారం, నిందితులు నేపాల్‌లో మొత్తం 7 సెకండ్ హ్యాండ్ మొబైల్ ఫోన్లను కొనుగోలు చేశారు. ఈ పరికరాల ద్వారా కట్టుబడి పని చేసే టెర్రర్ మాడ్యూల్ మధ్య కమ్యూనికేషన్ జరిగిందని అనుమానిస్తున్నారు. అలాగే 17 సిమ్ కార్డులను ఉపయోగించినట్లు గుర్తించబడింది. అందులో 6 సిమ్ కార్డులు ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్ బెకాన్‌గంజ్ అడ్రెస్ తో తీసుకున్నవేనని పరిశోధన చెబుతోంది. సిమ్ కార్డులకు ఇచ్చిన చిరునామాలు, ఐడెంటిటీ ప్రూఫ్‌లు, ఫోన్ యాక్టివేషన్ డేటా ఆధారంగా భద్రతా సంస్థలు దర్యాప్తు మరింత విస్తరించాయి. ఇప్పటికే వాయిస్ రికార్డులు, లొకేషన్ ట్రైల్స్, డిజిటల్ కమ్యూనికేషన్‌పై స్పెషల్ టీమ్ తమ దృష్టి సారించినట్లు సమాచారం. ఇక వైట్ కాలర్ టెర్రర్ మాడ్యూల్ కదిలిన సంగతి తెలిసిందే. అరెస్టులో ఉన్న డాక్టర్ పర్వేజ్ బావమరిది ఉస్మాన్ బెకాన్‌గంజ్‌లో బట్టల దుకాణం నడుపుతున్నట్లు గుర్తించారు. ఢిల్లీ స్పెషల్ సెల్ అతన్ని ఆరు గంటల పాటు విచారించినా పెద్దగా సమాచారం రాలేదని తెలిసింది. డాక్టర్ పర్వేజ్ ఇటీవల కాన్పూర్‌కు వెళ్లి, కల్నల్‌గంజ్, జీఎస్‌వీఎం మెడికల్ కాలేజ్, బాబుపూర్వా, మంధానా ప్రాంతాల్లోని స్నేహితులను కలిసినట్లు విచారణలో తేలింది. పేలుళ్ల మాస్టర్మైండ్‌గా ఆరోపణలు ఎదుర్కొంటున్న లేడీ డాక్టర్ షాహీన్ కూడా ఈ ఏడాది అక్టోబర్‌లో కాన్పూర్ వెళ్లినట్లు అధికారులు ఆరా తీశారు. ఆమె ఎవరిని కలిసింది? ఎవరి నుంచి సహాయం అందుకుంది? ఈ ప్రశ్నలపై దర్యాప్తు బృందాలు దృష్టి సారించాయి. ఢిల్లీ పేలుడుకు సంబంధించిన మిగతా వివరాలు త్వరలోనే వెలుగులోకి వచ్చే అవకాశాలు ఉన్నాయి.